

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రద్దు

చిన్నమండెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని పేదలందరికీ ఇళ్లు, గృహ ప్రవేశ వేడుకల కార్యక్రమంలో ఈనెల 29వ తేదీ జరగాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన మొంథా తుఫాన్ కారణంగా రద్దయినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని దేవగుడిపల్లె, బాహూజీనగర్‌లలో చంద్రబాబు పర్యటనకు అధికారులు అన్నీ సిద్ధం చేశారు. తుఫాన్ కారణంగా పర్యటన రద్దయిందని, వచ్చే నెలలో పర్యటన ఉండవచ్చని అధికారులు చెప్పారు.

చెరువుల భద్రతపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



గుమ్మసముద్రం చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

బి.కొత్తకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నిండిన చెరువుల భద్రత, మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజారక్షణ అధికారుల బాధ్యతగా భావించి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం చెరువును పరిశీలించారు. చెరువు మొరవను ఓవైపు ఇసుకబస్తాలతో మూసివేయడం, మళ్లీ తెరవడం, హంద్రీ-నీవా కాలువలోకి మొరవనీటి విడుదల, కాలువను తెంచి నీటిని మళ్లించడం లాంటి చర్యలపై హంద్రీ-నీవా అధికారుల వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో చెరువుల ఓవర్‌ఫ్లోపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కంట్రోల్‌రూంలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి పరిస్థితిని సమీక్షించాలన్నారు. ప్రమాదకరమైన వాగులు, చెరువుల మీదుగా ప్రజలు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హంద్రీ-నీవా ఎస్ఈ విఠల్‌ప్రసాద్, ఈఈ అమరనాథ్, డీఈ వెంకటప్రతాప్, తహశీల్దార్ బావాజాన్, ఆర్ఐ వీరాంజనేయులు, సీఐ గోపాల్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

24 గంటలు అప్రమత్తంగా ఉండండి

- పింఛా ప్రాజెక్టు పరిశీలనలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

సుండుపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. సోమవారం పింఛా ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టుకు దిగువ భాగంలో నీటి ప్రవాహానికి రాకపోకలు ఆగిపోయే ప్రమాదాలు ఉన్నాయా, ప్రస్తుతం రాకపోకలు జరుగుతున్నా యా లేదా అని తెలుసుకున్నారు. పైప్రాంతం నుంచి భారీగా నీరు వస్తే ప్రాజెక్టుకు ప్రమాదం ఉందా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రాజెక్టు దిగువ భాగంలోని రైతులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నదీ పరివాహానికి ఇరువైపులా పల్లెలు ఉంటే వారు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను, నూతనంగా జరిగిన ప్రాజెక్టు పనులను పరిశీలించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసులను పహారాగా నియమించాలని ఎస్ఐకి తెలిపారు. పోలీసులు అధికారులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ ఐ శ్రీనివాసులు, ప్రాజెక్టు ఆపరేటర్ దొరవేలు తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న మొంథా



- తుఫానును ఎదుర్కొనేందుకు సిద్ధం
- పునరావాస కేంద్రాలు.. కంట్రోల్‌రూంల ఏర్పాటు
- ప్రమాదకర చెరువుల వద్ద ఇసుక బస్తాలు
- క్షేత్రస్థాయిలోకి కలెక్టర్, ఎస్పీ
- పాఠశాలలకు సెలవులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తరుముకొస్తున్న మొంథా తుఫాన్ వల్ల ఏర్పడే విపత్తును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం రెండు రోజులుగా సిద్ధమవుతోంది. జిల్లాలో ఇప్పటికే పలు చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు సైతం గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు నిండుకుండలా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మొంథా ప్రభావం జిల్లాపై ఎక్కువగా పడితే అనేక చెరువులు, కుంటలు తెగిపోయే ప్రమాదముంది. దీంతో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగా పలు పటిష్ట చర్యలు తీసుకుంటోంది. లోతట్టు ప్రాంతాలు ఉన్నచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారి కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తుఫాన్ పరిస్థితిపై తెలుసుకునేందుకు జిల్లాలో సబ్‌కలెక్టర్ కార్యాలయాలు, త



సుండుపల్లెలో ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్న అధికారులు


హసీల్దార్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమ, మంగళవారాలు సెలవులు ప్రకటించారు. సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. స్వయంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు జిల్లాలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. సోమవారం ఉదయం నుంచి జిల్లాలో పలుచోట్ల వర్షం ప్రారంభమైంది. రైల్వేకోడూరులో భారీ వర్షం కురుస్తోంది. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా తేలికపాటి వర్షం పడుతోంది. మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

గాలివీడు మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. సోమవారం నీళ్లు దిగువకు విడుదల చేశారు. ఒక గేటు ద్వారా 750 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు. సుండుపల్లె మండలంలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటే ఒకటి రెండు చెరువులు తెగే ప్రమాదముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటికే పింఛా ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. పై ప్రాంతాల నుంచి భారీగా వర్షపునీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టులోకి చేరుతున్న నీటి కంటే అధికంగా నీటిని కిందకు వదులుతున్నారు. రైల్వేకోడూరులో మూడు పునరావాస కేంద్రాలను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. రైల్వేకోడూరులో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. పెద్దతిప్పసముద్రం మండలంలో ముందస్తు చర్యగా మండలంలో మూడు పునరావాస కేంద్రాలను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. సిబ్బందికి 24 గంటలు విధులు కేటాయించారు.


నిమ్మనపల్లె మండలంలో బాహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండగా మూడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. వాల్మీకీపురం రహదారి కొండయ్యగారిపల్లె రహదారుల్లో బాహుదా నీరు ప్రవహిస్తూ ఉండడంతో ఆ గ్రామాల్లోని ప్రజలు బయటకు వెళ్లకుండా కంచె వేసి అధికారులు చర్యలు చేపట్టారు. రాయచోటి మండలంలోని కాటిమాయకుంట గ్రామం గుంటిమడుగు వద్ద ఉన్న చెరువుకు గండి పడింది. అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. సంబేపల్లె మండలంలో ఝరికోన ప్రాజెక్టుకు 50 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది.

నిండుకుండలా ప్రాజెక్టులు

జిల్లాలో పింఛా, ఝరికోన, బాహుదా ప్రాజెక్టులు పూర్తిగా నిండి ఉన్నాయి. వెలిగల్లు ప్రాజెక్టు కూడా దాదాపు నిండి ఉంది. సుమారు 500కు పైగా చెరువులు పూర్తిగా నిండి ఉన్నాయి. కుంటలు సైతం నిండి మొరవపోతున్నాయి. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల భారీగా వానలు పడితే ఇందులో చాలా వరకు చెరువులు, కుంటలు తెగిపోయే ప్రమాదముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తాత్కాలిక మరమ్మతుల కోసం ఇసుక బస్తాలు సిద్ధం చేశారు.



నిండుకుండలా బాహుదా ప్రాజెక్టు



పూర్తిగా నిండిన పింఛా ప్రాజెక్టు

క్షేత్రస్థాయిలోకి కలెక్టర్, ఎస్పీ

రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు స్వయంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. బి.కొత్తకోట మండలంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ సోమవారం సాయంత్రం గుమ్మసముద్రం చెరువును పరిశీలించారు. హెచ్ఎన్ఎస్ఎస్-పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా నిండే చెరువులపై నిఘా ఉంచి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పింఛా ప్రాజెక్టును ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సందర్శించి అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

తక్కువ ధరకే బంగారం పేరుతో మోసం



వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కంతుల వారీగా నగదు చెల్లిస్తే తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ ప్రజలను ఆకర్షించిన ఓ నగల వ్యాపారి లక్షలాది రూపాయలు వసూలు చేసి పరారైన ఉదంతం సోమవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని సిపాయివీధికి చెందిన శ్రీసాయిసురేశ్ జువెలర్స్ యాజమాని సురేశ్ బంగారం పేరుతో కొద్ది రోజులుగా పలువురి నుంచి సుమారు రూ.25 లక్షల వరకు వసూలు చేసి ఆదివారం రాత్రి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు సోమవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహేశ్ అనే వ్యక్తి నుంచి రూ.3.40 లక్షలు, రెడ్డిప్రసాద్ నుంచి 150 గ్రాముల బంగారం, రూ.15 లక్ష నగదు, రవిచంద్ర నుంచి రూ.3 లక్షలు, రవితేజా నుంచి రూ.8 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసి న్యాయం చేస్తామని పోలీసులు బాధితులకు హామీ ఇచ్చారు.

మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారయత్నం

- పోలీసుల అదుపులో ఇద్దరు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలిక (15)పై ఇద్దరు వ్యక్తులు అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. మతిస్థిమితం లేని బాలిక తల్లి చిన్న వయస్సులోనే మృతి చెందిందని తండ్రి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తో బాలికను పోషిస్తున్నాడు. శివ, నాగేంద్ర అనే వ్యక్తులు మద్యం తాగి ఆదివారం సాయంత్రం బాలిక ఇంట్లోకి చొరబడి అత్యాచారయత్నంకు పాల్పడ్డారు. వెంటనే బాలిక కేకలు వేయడంతో పక్కనే బంధువులు వెంటనే అక్కడికి చేరుకోవడంతో నిందితులు పరారయ్యారు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలుపగా వారు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. బాలిక పిన్ని, తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, బాలికను పరీక్షల కోసం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

మల్లయ్యకొండకు కార్తిక శోభ





ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు, స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

తంబళ్లపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మొదటి కార్తిక సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు మలయ్యకొండకు తరలివచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా రాయలసీమ జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో కొండ మొత్తం భక్తులతో కిటకిటలాడింది. ఓం నమఃశివాయ, హర హర మహదేవ.. శంభో శంకర.. అంటూ భక్తులు శివన్నామస్మరణ చేసుకుంటూ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు ఈశ్వరప్ప స్వామి వారిని నాగాభరణంతో విశేషంగా అలంకరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రత నోములు నోచుకున్నారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి స్వామి వారిని మొక్కుకున్నారు. మల్లయ్యకొండ పైన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తులకు మాజీ మల్లయ్యకొండ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం మల్లయ్యకొండ పైకి ఆర్టీసీ బస్సులను నడిపారు.



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జున స్వామి


బాహుదా నుంచి దిగువకు నీరు



బాహుదా గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాహుదా ప్రాజెక్టు జలకళ సంతరించుకొంది. పూర్తి స్థాయిలో నిండడంతో సోమవారం ఇరిగేషన్ అధికారులు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. పాఠశాలలకు రెండు రోజులు సెలవులు కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చి బాహుదా ప్రాజెక్టును సందర్శించారు. బాహుదా ప్రాజక్టు సామర్థ్యం 398 ఎంసీఎఫ్‌టీలు. పూర్తి స్థాయిలో నిండితే నిమ్మనపల్లి వాల్మీకిపురం, పీలేరు మండలాలకు సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదు. ప్రాజెక్టుకు ఎడమ కాలువ 7.6 కిలోమీటర్లు ఉండగా, కుడి కాలువ ఒక కిలోమీటర్ ఉంది. వీటికి అనుసంధానంగా 29 డ్రింగ్ ఛానల్స్ ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ 7.6 పొడవు ఉన్న ఎడమ కాలువ పూర్తిగా ధ్వంసం కావడంతో రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం లేదు. బాహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో భూగర్భజలాలు పెరుగుతాయని స్థానిక ప్రజలతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెలిగల్లు నుంచి నీటి విడుదల



వెలిగల్లు ప్రాజెక్టు గేటు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

గాలివీడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెలిగల్లు ప్రాజెక్టు నుంచి సోమవారం నీటిని విడుదల చేసినట్లు వెలిగల్లు ప్రాజెక్టు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు భాస్కర్‌బాబు, శిరీష్‌కుమార్‌లు తెలిపారు. ఒక గేటు ద్వారా 750 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇది చాలా స్వల్పమేనని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. డ్యాం గరిష్ఠ నీటి విడుదల సామర్థ్యం 1,51,000 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం 750 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశామని, భారీ వర్షాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు వారు వివరించారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

- 14 మంది అరెస్ట్
- రూ.10 లక్షల విలువ గల 34 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



పట్టుబడ్డ గంజాయితో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జిల్లా అదనపు ఎస్పీ, తదితరులు



పట్టుబడ్డ గంజాయి ముఠా సభ్యులు, వాహనాలతో పోలీసు అధికారులు

రాయచోటిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా కలకడ మండలంలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో రూ.10 లక్షల 20 వేల విలువ గల సుమారు 34 కిలోల గంజాయినీ స్వాధీనం చేసుకుని, దాని వెనుక ఉన్న గంజాయి ముఠాలోని ప్రధాన నిందితుడు షేక్ బాషాతో కలిపి 14 మంది ముఠా సభ్యులను అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి గంజాయి ముఠా వివరాలను వెల్లడించారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, కలకడ, సీఐ లక్ష్మన్న పర్యవేక్షణలో కలకడ ఎస్ఐ రామాంజనేయులు పక్కా సమాచారంతో సోమవారం ఉదయం 6.30 గంటలకు కలకడ మండలంలోని బంగారువాండ్లపల్లె, నడిమిచెర్ల, కొత్తపల్లి రోడ్డులోని రాతిదిబ్బ సమీపంలో పోలీసులు మెరుపు దాడి చేయగా గంజాయితో సిద్ధంగా ఉన్న నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని చుట్టుముట్టి పట్టుకున్నారన్నారు. ఆపరేషన్‌లో పట్టుబడిన 13 మంది పురుషులతో పాటు ఒక మహిళా నిందితురాలు సహా మొత్తం 14 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.10.20 లక్షల విలువ చేసే 34 కిలోల గంజాయి, రవాణాకు ఉపయోగించిన ఆటో, మూడు మోటారు సైకిళ్లు, 12 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు షేక్ బాషా ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా చిన్నచిన్న విక్రయదారుల ద్వారా అన్నమయ్య జిల్లా పరిధిలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను రిమాండు నిమిత్తం వాయల్పాడు కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, కలకడ సీఐ లక్ష్మన్న, ఎస్ఐ రామాంజనేయులు, పీఎస్ఐ హారిక, పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



జగదాంబ సెంటర్ వీధిలో వర్షానికి రోడ్లపైకి వచ్చిన మురుగునీరు

రాయచోటి పట్టణంలోని ఠాణా సమీపంలో మురుగునీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తూ కనిపిస్తుంది. చిన్నపాటి వర్షం పడినా మురుగు మొత్తం రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ఇప్పటి వరకు దాదాపు పది మంది కమిషనర్లు విధులు నిర్వహించినా ఏ ఒక్కరూ మున్సిపాలిటీని పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో భారీ వర్షాల కారణంగా మురుగు కాలువలు పొంగి నలుగురి మృతికి కారణమైన విషయం విదితమే..

- అస్తవ్యస్తంగా మురుగు కాలువల వ్యవస్థ
- విచ్చలవిడిగా కాలువల ఆక్రమణ
- రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు
- అభివృద్ధికి సహకరించని నాయకులు
- అధికారుల్లో నిర్లిప్తత

వానొస్తే.. వరదే..!

రాయచోటి - కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే రాయచోటి పట్టణంలో వాగులు ప్రవహిస్తున్నాయి. గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా ఉండడంతో ఎంత వర్షం పడినా ఎక్కడికక్కడ నీరు బయటికి వెళ్లిపోయేది. 2005లో మున్సిపాలిటీగా మారినప్పటి నుంచి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది.

రాయచోటి పట్టణంలో 40 వేల జనాభాకు తగిన సామర్థ్యంతో అక్కడక్కడ డ్రైనేజీలు నిర్మించారు. అవే ఇప్పుడూ ఉపయోగంలో ఉన్నాయి. 2012లో పీఎల్ఆర్ కంపెనీ వాళ్లు రూ.17 కోట్లతో రాయచోటి మున్సిపాలిటీలో మురుగు కాలువల నిర్మిస్తున్నామని చెప్పి కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే నిర్మించి చేతులు దులుపుకున్నారు. జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి పరిస్థితి మరీ దారుణంగా మారింది. జిల్లా అధికారులు ఉన్నా పట్టణంలో రోడ్లు, మురుగు కాలువల వంటి కనీస వసతులు కల్పించాలన్న విషయం విస్మరించారని ప్రజలు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ. 340 కోట్లతో అండర్ డ్రైనేజీ వేస్తున్నామని హంగామా చేసిన నాయకులు, అధికారులు ఎక్కడో ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో రెండు, మూడు కిలోమీటర్లు మాత్రమే వేసి.. చేతులు దులుపుకున్నారు.ఇప్పటికైనా అధి కారులు, నాయకులు స్పందించి, డ్రైనేజీ, సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

పదేళ్ల నుంచీ ఇదే పరిస్థితి..

రాయచోటి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ దాదాపు పదేళ్ల నుంచి పూర్తిగా దెబ్బతినింది. టౌన్ ప్లానింగ్ విభాగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే తప్ప ఈ మున్సిపాలిటీ గాడిలో పడే పరిస్థితి లేదు. గతంలో ఇక్కడ పనిచేసిన టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యమే డ్రైనేజీ వ్యవస్థ దుస్థితికి కారణం. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలను ఆక్రమించి మరీ ఇళ్లు కడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇష్టానుసారం ఇళ్ల నిర్మాణం, మురుగు కాలువల పూడ్చివేత, కాలువలపైన ఇళ్ల



స్వల్ప వర్షానికే బురదమయమైన బస్టాండు రోడ్డు

రాయచోటి పట్టణంలో ఎక్కువగా ఉన్నాయి. రూ. 3 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు సహకరించమని కౌన్సిల్‌ను పదిసార్లు అడిగినా అంగీకరించకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నాం. పట్టణ అభివృద్ధికి సహకరించని ప్రజాప్రతినిధులు ఉంటే అధికారులు మాత్రం ఏం చేస్తారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో కోచ్‌లు తదితరులు

రైల్వేకోడూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీవీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అండర్-19 తైక్వాండో పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎం. చంద్ర మోహన్‌రాజు, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి సీ. శారద మాట్లాడుతూ ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా అండర్ 46 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున బాలుర అండర్ 45 కేజీ విభాగంలో వరుణ్ కుమార్ (విజయనగరం), అండర్ 48 కేజీ విభాగం లో సి. గిరి (శ్రీకాకుళం), అండర్ 51 కేజీ విభాగంలో ఎస్. సాహిల్ (చిత్తూరు), అండర్ 55 కేజీ విభాగంలో బి. గౌతంకుమార్ (చిత్తూరు), అండర్ 59 కేజీ విభాగంలో ఓ. సువార్త (ప్రకాశం), అండర్ 63 కేజీ ఎం. కలవగిరి (ప్రకాశం), అండర్ 68 కేజీ బీకే చైతన్య (విశాఖపట్నం), అండర్ 78 కేజీ కే. రోహిత్‌కుమార్ (విజయనగరం), అండర్ 73 కేజీ బీ. జస్వంత్ (విజయనగరం), 78 కేజీ పీ. ధనుష్‌తేజ (ఈస్ట్‌గోదావరి)ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. బాలికల విభాగంలో అండర్ 40 కేజీ విభాగంలో ఎస్. కరిష్మా (అనంతపురం), అండర్ 42 కేజీ జి. కృష్ణకీర్తన (అనంతపురం), అండర్ 44 కేజీ పి. పూజిత (అనంతపురం), అండర్ 46 కేజీ పీఎస్ఎస్ఎస్ నిహారిక (ఈస్ట్‌గోదావరి), అండర్ 49 వి. హిమశ్రీ (విజయనగరం), అండర్ 52 కేజీ ఎస్. అక్సా (కడప), అండర్ 55 విభాగం పి. మేరీస్టెల్లా (ప్రకాశం), అండర్ 59 కేజీ కే. తేజశ్రీ (కృష్ణా), అండర్ 63 విభాగంలో బీఎల్ అక్షర (ప్రకాశం), అండర్ 68 కే. యామినిదేవి (విశాఖపట్నం) అండర్ 68 బి. హారిక (కడప) ను ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రవి మృతదేహం

రాయచోటిటౌన్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటోను బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంబేపల్లె మండలం దిన్నెపల్లెకు చెందిన రవి (22) సోమవారం తన స్నేహితులను ద్విచక్రవాహనంపై రాయచోటి రింగురోడ్డు వద్ద దించి, మరో స్నేహితుడికోసం రాయచోటికి వస్తుండగా ఎస్ఆర్ కల్యాణ మండపం సమీపంలో ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా కుడివైపు తిప్పడంతో వెనుకే వస్తున్న రవి ఆటోను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని స్థానికులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రాయచోటి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి 7 నెలల జైలు



ముద్దాయి అరవింద్

రైల్వేకోడూరు, రూరల్ అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడికి ఏడు నెలల జైలు శిక్ష ఖరారు చేస్తూ సోమవారం రైల్వేకోడూరు కోర్టు న్యాయమూర్తి తేజసాయి తీర్పునిచ్చినట్లు రైల్వేకోడూరు అర్బన్ సీఐ కే. హేమసుందరరావు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం, అబ్దుల్లాపురానికి చెందిన మాదిగ అరవింద్ రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ట్రాక్టర్, మోటారు సైకిల్‌ను దొంగిలించాడని, ఈ రెండు కేసుల్లో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ట్రాక్టర్ దొంగతనం కేసులో నాలుగు నెలలు, మోటారు బైక్ దొంగతనం కేసులో మూడు నెలల జైలు శిక్ష విధించారని తెలిపారు. నిందితుడిని రాజంపేట జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడదలచిన వారికి హెచ్చరికగా నిలుస్తుందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజా యి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమ వారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం, తల్లివారిపల్లె సమీపం లోని చెరువుకట్ట వద్ద శనివారం సాయంత్రం మదనపల్లె మండలం, వలసపల్లె, మొలకలదిన్నెకు చెందిన ఎరుకల శ్రీనివాసులు (35) కురబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన ఆనంద కుమార్ (27)ను అదుపులోకి తీసున్నామని, వీరికి గంజాయి సరఫరా చేస్తున్న మదనపల్లెకు చెందిన సయ్యద్ జాఫర్ అలీ, శివకుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయి, ఒక పల్సర్ బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎరుకల శ్రీనివాసులుపై మదనపల్లె తాలూకా, టూటౌన్, ముదిగుబ్బ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి విద్యార్థి ఆత్మహత్యా యత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కురబలకోటకు చెందిన నాగరాజ కుమారుడు ప్రదీప్(19) మదనపల్లెలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. సక్రమంగా చదవడంలేదని కుటుంబ సభ్యులు మందలించడంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు అతనిఇ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 ద్విచక్రవాహనాలు సీజ్



ముదివేడు పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మైనర్లు నడుపుతున్న 25 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని అంగళ్లులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ముఖ్యంగా మైనర్లు, యువత అతి వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి - నేతాజీ సర్కిల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారాన్ని నేరుగా పర్యవేక్షిస్తోందన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రాయచోటి బోస్ నగర్‌కు చెందిన షేక్. షబానాకు ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించినట్లు హెచ్ఏఎస్ఎఫ్ 230525042284గా ఆన్‌లైన్‌లో చూపుతున్నదని, కానీ ఆమెకు ఇప్పటి వరకు ఎలాంటి పట్టా ఇవ్వలేదని, ఈ విషయాన్ని పరిశీలించి ఇంటి స్థలాన్ని ఇప్పించాల్సిందిగా కల్టెర్‌కు విన్నవించుకున్నారు. తన భర్త 2009, సెప్టెంబరు 3న మరణించాడని, తనకు మంజూరైన వితంతు పింఛనును ఈ మధ్య కాలంలో నిలిపేశారని, దానిని పునరుద్ధరిం చాలని నిమ్మనపల్లిపరిధిలోని కొండయ్యగారిపల్లెకు చెందిన రాజ మ్మ విన్నవించుకున్నారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్ అర్జీలు స్వీకరించారు.

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

● జిల్లా సాధన సమితి డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి నాయకులు

మదనపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ కొలిక్కి రావడం హర్షణీయమని, మంగళవారం జరిగే మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించేందుకు మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం సీఎంతో భేటీ అవుతున్న నేపథ్యంలో సోమవారం స్థానిక బాస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెను జిల్లా కేంద్రం చేసేందుకు సాధ్యాసాధ్యాలపై నివేదికలో వివరించనున్నట్లు వెల్లడైన విషయం ఇక్కడి ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఇలాంటి అపోహలకు, ఆందోళనలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా మంగళవారం ఉపసంఘంతో జరిగే భేటీలో సీఎం ప్రకటన చేసి స్పష్టత ఇవ్వాలని కోరారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో పాటు యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల ప్రజల విజ్ఞప్తి మేరకు ఆ రెండు మండలాలను కూడా మదనపల్లె జిల్లాలో కలపాలని కోరారు. మంగళవారం మదనపల్లెలో నిర్వహించతలపెట్టిన బిగ్ డిబేట్‌ను తుఫాను కారణంగా నవంబరు 4వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె సాధన సమితి కోకన్వీనర్ రెడ్డిసాబ్, తోపు కృష్ణప్ప, శ్రీచందు, దుగ్గిరెడ్డి ప్రభాకర్, బాస్ నాయకులు తలారి కృష్ణ, గంగాధర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుదాం..!

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల్లో సత్తా చాటుదామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ నేతలతో కలసి మండలంలోని కన్నెమడుగు, రేణుమాకులపల్లె, ఎద్దులవారిపల్లెల్లో ముమ్మరంగా పర్యటించారు. పలువురు నేతలను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఎవ రికి ఏ సమస్య వచ్చినా అండగా నిలబడి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వర్గాలు వీడి అందరం కలసికట్టుగా పనిచేసి వచ్చే సంస్థాగత ఎన్నికల్లో శత శాతం కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసి తంబళ్లపల్లెలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొద్దామన్నారు. మాజీ గ్రామాధ్యక్షుడు బోయపల్లె శివ, మునాఫ్, సిద్దారెడ్డి, బాసూసాబ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో కేదారేశ్వర వ్రతం





ప్రత్యేక అలంకారంలో అఘోర లింగేశ్వరుడు,కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా కేదారేశ్వర స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నాగేశ్వరస్వామి, కేదారేశ్వర వ్రత పూజా విధానము, పూజా విశిష్టత భక్తులకు వివరించారు. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు, కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అఘోరలింగేశ్వర స్వామి ఆలయంలో వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

గుండాలకోనకు రావద్దు

● భక్తులకు సీఐవిజ్ఞప్తి

చిట్వేలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో గుండాలకోన కర్కటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు రావద్దని సీఐ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. కోన నుంచి నీరు ఉధృతంగా వచ్చే అవకాశం ఉన్నందున, చుట్టుపక్కల వంకల్లో ప్రవాహం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందువల్ల కోన సందర్శనను వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భక్తులను ఇతర ప్రాంతాలకు తరలించామని వివరించారు. కొత్తగా ఎవరూ వచ్చేందుకు ప్రయత్నించరాదని తెలిపారు.

పీహెచ్‌సీలో మలేరియా అధికారి తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆకస్మింగా తనిఖీ చేశారు. ల్యాబ్ స్థితిగతులు, రికార్డులు, ల్యాబ్ నెలవారీ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాధామాధవి, శైలజ, సబ్-యూనిట్ విద్యాసాగర్, సీహెచ్‌వో సరస్వతి, ఆరోగ్య పర్యవేక్షకులు చిన్నప్ప, సిబ్బంది రాజమణి, హెచ్‌ఈ కృష్ణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ మునీర్, ఫార్మసిస్ట్ యుగంధర్, ఆరోగ్య కార్యకర్తలు శివప్రసాద్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు గురుకులం విద్యార్థి



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయినులు

నందలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీసీ గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎస్.నిత్య ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి డిస్క్‌త్రో, షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ చూపి హర్యానాలో జరుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలియజేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఫస్టియర్ సీఈసీ చదువుతున్న కె.మానస రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు. ఇంటర్ విద్యార్థినులకు నీట్, జేఈఈ ప్రవేశాలకు ఈ పతకాలు ఉపయోగపడతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు కేజీ సునీతను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు పాటూరు విద్యార్థినులు



నక్షత్ర



యేసుప్రియ



శివమంజుల

నందలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కడప పట్టణంలోని మాంటిస్సోరి జగతి ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం జరిగిన అండర్ 14, అండర్ 17 బాల బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.యేసుప్రియ, బి.నక్షత్ర, అండర్-14 విభాగంలో, ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిరువురు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు, అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరచిన కె.శివమంజుల తూర్పుగోదావరి జిల్లా కోవూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవీలత మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుతూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ ఎం.సుస్మిత, పీఈటీ పి.జగన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు

పీలేరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.3కోట్లతో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ కమలాకర్ రెడ్డి, ఏఈ రామకృష్ణనాయక్ తెలిపారు. అగ్రహారం పంచాయతీకి రూ.14.25 లక్షలు, బోడుమల్లువారిపల్లెకు రూ.10లక్షలు, దొడ్డిపల్లె పంచాయతీకి రూ.22.50 లక్షలు, గూడరేవుపల్లెకు రూ.9.30లక్షలు, జాండకు రూ.10లక్షలు, కాకులారంపల్లెకు రూ.9.50లక్షలు, కావలిపల్లెకు రూ.12లక్షలు, మేళ్లచెరువుకు రూ.9లక్షలు, పీలేరుకు రూ.82.70లక్షలు, రేగళ్లుకు రూ.30లక్షలు, తలపులకు రూ.34.25లక్షలు, వేపులబైలుకు రూ.21.50 లక్షలు, యర్రగుంటపల్లెకు రూ.12.50లక్షలు, ముడుపులవేములకు రూ.12.50లక్షలు, బాలంవారిపల్లె పంచాయతీకి రూ.10 లక్షలతో సీసీ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా పనులు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

చెవిరెడ్డి పీఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా గతంలో పనిచేసిన (రేణిగుంట పంచాయతీ సెక్రటరీ) గుర్రాల శ్రీనివాసులుపై ఆయన సోదరుడి కుమారుడు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాయచోటిలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాసులు సోదరుడు గుర్రాల మణికంఠ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మణికంఠ కథనం మేరకు తమ కుటుంబానికి పీలేరు మండలం ముడుపులవేముల గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.510లో వారసత్వంగా సంక్రమించిన 4.13 ఎకరాల భూమి ఉండేదన్నారు. తల్లిదండ్రులిద్దరూ తన చిన్నతనంలోనే కన్నుమూయడంతో మేనమామ వాళ్ల దగ్గర ఉంటున్నానని తెలిపాడు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి వద్ద పనిచేస్తున్న తన పెద్దనాన్న పీలేరులోని అధికారులను భయపెట్టి ఆ భూమిని ఈనెల 21వ తేదీ తన పేరిట రిజిస్టర్ చేసుకున్నాడన్నారు. తాను, తన మేనత్తలు పలుమార్లు వేడుకున్నా తమకు న్యాయంగా రావాల్సిన భాగాలను ఇవ్వలేదన్నారు. తనకు, తన మేనత్తలకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు.

హార్సిలీహిల్స్‌లో కార్తీక వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ సెక్షన్‌ఆఫీసర్ శివకుమార్

బి.కొత్తకోట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. టూరిజం, అటవీశాఖ సిబ్బంది స్థానికులతో కలిసి కొండపై ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏనుగుమల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఏపీ టూరిజం మేనేజర్ కొల్లిశ్రీధర్‌తో కలిసి సెక్షన్ ఆఫీసర్ శికుమార్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు వృక్షాలను రక్షించాలని, ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయోమయం... గందరగోళం

- గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో వైద్యశాఖ ఉద్యోగులకు తప్పని తిప్పలు
- బదిలీలతో రెండవ ఏఎన్ఎంల పరిస్థితి అయోమయం
- ఆ జీవోలను రద్దు చేయాలంటూ ప్రభుత్వంపై వత్తిడి



కడప కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) గతంలో జగన్ సర్కారులో ప్రజలకు ఉచిత వైద్యమంటూ తీసుకొచ్చిన రీడిప్లయ్మెంట్, 143 జీవోలు వైద్యశాఖలో ఉద్యోగులను గందర గోళపరిస్థితికి నెట్టాయి. ఆజీవోలు అమలు మాట దేవుడెరుగు రెగ్యులర్ ఏఎన్ఎంలను, అరకొర జీతాలతో ఏళ్ల తరబడి రెగ్యులర్ కాని రెండవ ఏఎన్ఎంలను జిల్లా, అంతర్‌జిల్లాల బదిలీలతో వైద్యశాఖను అవినీతిమయం చేశారనే విమర్శలున్నాయి. అప్పటి ప్రభుత్వ పెద్దల పెత్తనంతో మంచీ చెడూ చెప్పకుండా దూడూ బసవన్నలా వ్యవహరించిన కొందరు అధికారులు, అప్పటి సంఘనాయకులతో ఉద్యోగులకు అన్యాయం జరిగిందని.. ప్రక్షాళన చేయాలంటూ తెలుగునాడు అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమయ్యారు. జగన్ సర్కారు తెచ్చిన రీడిప్లయ్మెంట్ విధానం రద్దుకు వైద్యశాఖలో కొన్ని విభాగాల ఉద్యోగులు కూటమి సర్కారుపై ఒత్తిళ్లు పెంచేందుకు సిద్ధమయ్యారు.

సచివాలయ వ్యవస్థతోనే తిరకాసు

వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ వచ్చింది. అప్పటి నుంచి ఏఎన్ఎంల బదిలీలు, స్టాఫ్ నర్సుల శిక్షణలంటూ ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్‌సీలలో పనిచేసే రెగ్యులర్, రెండో ఏఎన్ంలను, జిల్లా క్యాడర్ ఉద్యోగులను జిల్లా మారుమూలలకు బదిలీలు చేసి వైద్యశాఖలో ఉచిత వైద్యం చేయాల్సిన వారిలో వైసీపీ వ్యతిరేక విధానాలతో విసిగిపోయారు. ప్రాథమిక కేంద్రానికి 14 మంది సిబ్బంది అంటూ అశాస్త్రీయంగా 143 జీవో రీడిప్లయ్మెంట్ విధానాన్ని తెచ్చి ఆశాఖ ఉద్యోగులతో ఆడుకున్నారనే విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థను తెచ్చి అందులో మూడో ఏఎన్ఎంలను నియమించారు. అయితే ఆరోగ్య ఉపకేంద్రాలలో రెగ్యులర్, రెండవ ఏఎన్ఎంలు ఉన్నారు. సచివాలయం ఏఎన్ ఎంలను కలుపుకుంటే ఎక్కువ మంది ఉన్నారని ఆలస్యంగా గ్రహించిన అధికారులు కొంతమందిని రెండేళ్ల స్టాఫ్ నర్సు శిక్షణకు పంపారు. శిక్షణకు పంపిన వారి స్థానంలో రీడిప్లయ్మెంట్ విధానంలో రెగ్యులర్, రెండవ ఏఎన్ఎంలను ఇష్టారాజ్యంగా 50-150 కిలోమీటర్ల దూరప్రాంతాలకు బదిలీ చేసి వైద్య ఉద్యోగుల్లో గందరగోళ పరిస్థితులు తెచ్చారంటున్నారు. వీరిలో మండలాల్లో చాలీ చాలనీ జీతాలతో పనిచేసే రెండవ ఏఎన్ఎంల పరిస్థితి దారుణంగా మారింది. ఇక పీహెచ్‌సీలకు సంబంధించి 14 మంది సిబ్బంది అంటూ 143 జీవో తెచ్చి అందులో నలుగురు పర్యవేక్షణ సిబ్బంది పేరుతో ఉత్తర్వులు జారీ చేసి నేటికి అమలు లేదు. దీంతో గత జగన్ సర్కారులో ఇచ్చిన జీవోలతో అన్ని క్యాడర్లలో ప్రమోషన్లకు గండి కొట్టారంటూ ఆందోళనబాటకు శ్రీకారం చుట్టారు.

బదిలీల్లో అవినీతికి పరాకాష్ట

వైద్య శాఖలో అన్ని క్యాడర్లను పొంతన లేకుండా నియమించి.. వైద్య ఉద్యోగుల బదిలీల్లో ఎల్‌డీసీ పోస్టుకు యూడీసీ పోస్టులతో ముడిపెట్టి వైద్య ఉద్యోగులను గందర గోళపరిస్థితులకు నెట్టారు. నాన్చుడు ధోరణిలో ప్రమోషన్లకు ఎసరు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక జిల్లా క్యాడర్‌కు, జోనల్ క్యాడర్‌కు రాష్ట్ర క్యాడర్లను జోనల్ సంచాలకులు అశాస్త్రీయమైన పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించి అప్పటి ప్రభుత్వ విధానాలకు అవినీతి ఆజ్యం పోశారంటూ విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానలను ఎండగడుతూ కూటమి సర్కారులో రీ డిప్లయ్మెంట్ విధానం రద్దుకు తెలుగునాడు వైద్య అసోషియేషన్ ఉద్యమ బాటకు సిద్ధమైంది. ఈమేరకు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల ఐక్యతతో నిరసనల ద్వారా గత ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రక్షాళన చేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నారు.

పొలంలోనే కుళ్లిపోతున్నాయి...

- ధర లేక ఉల్లి రైతుల కష్టాలు



దువ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ధరలేక పంటను కొనుగోలు చేసేవారు లేక ఆవేదన చెందుతున్నారు. చేతికందిన పంటను పొలంలోనే వదిలేసి కన్నీటి పర్యంతమవుతున్నారు. 15 నుంచి 20 రోజుల కిందట పొలం నుంచి తీయాల్సిన ఉల్లిపంటను చేసేది లేక భూమిలోనే వదిలేస్తున్నారు.

మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేటతో పాటు పలు మండలాల్లో పెద్దబళ్లారి రకం ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. అప్పులు చేసి పెట్టుబడులకు డబ్బులు సమకూర్చుకుని పంట సాగు చేశారు. నిరుడు, అంతకుముందు సంవత్సరాల్లో పెద్దబళ్లారికి గిరాకీ ఉండడం, అప్పట్లో మంచి ఆదాయాలు రావడంతో ఈ పంట సాగుపై చాలా మంది రైతులు ఆసక్తి చూపారు. ప్రస్తుతం ధర లేక కొనుగోలు చేసే వారు లేకపోవడంతో వీరిలో నిరాశ, నిస్పృహ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎప్పుడో తీయాల్సిన ఉల్లిని తొలగించకపోవడంతో వర్షాలతో దెబ్బతిని కుళ్లు సోకుతుండడంతో సంబంధిత రైతు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు లక్షల్లో నష్టాలను మూటకట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

పది ఎకరాలు కౌలుకు తీసుకున్నా...

పది ఎకరాలు కౌలుకు తీసుకుని పెద్దబళ్లారి రకం ఉల్లి పంట సాగు చేశాను. ఆరు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాను. రెండేళ్ల కిందట మంచి లాభాలు వచ్చాయి. ధర లేక పరిస్థితులు తిరగబడ్డాయి. కౌలు పొలమే నాకు ఆధారం. ఏమీ పాలుపోవడం లేదు.

- వెన్నపూస పెద్దకొండారెడ్డి, గుడిపాడు గ్రామం.

పరిహారం అందజేయాలి



నేను సాధారణ కౌలు రైతును. పరిస్థితులు అనుకూలిస్తే మంచి ఆదాయం వస్తుందనుకున్నాను. ధర లేక ప్రస్తుతం పీకల లోతు అప్పుల్లో మునిగాను. ప్రభుత్వం కొనుగోలు చేయడమో, పరిహారం ఇవ్వడమో చేయాలి. లేదంటే మాలాంటి పేద రైతులు కోలుకోవడం కష్టం.

- మిట్టా శివారెడ్డి, రైతు, గుడిపాడు గ్రామం

ప్రారంభమైన బీఎడ్ పరీక్షలు



పరిశీలిస్తున్న వీసీ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధి ఉమ్మడి కడప జిల్లాలోని 17 కేంద్రాలలో బీఎడ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను 21,665 మంది విద్యార్థులు రాస్తున్నారు. తొలి రోజు కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, కేంద్రంలోని పరిసరాలను పరిశీలించారు. పరీక్షలు నిబంధనలను అనుసరించి కట్టుదిట్టంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు వివరిస్తూ రెండు జిల్లాలోని అన్ని కేంద్రాలకు విశ్వవిద్యాలయం తరఫున అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. అలాగే స్క్వాడ్ బృందాల సభ్యులు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని వీసీకి వివరించారు.

వైద్యశాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

- మెడికల్ ఆర్డీకి ఎన్జీవో సంఘ నేతల వినతి



కడప మెడికల్ ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

కడప కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ రీజియన్ పరిధిలోని అన్ని క్యాడర్లలోని ఉద్యోగులకు అర్హతల మేరకు పదోన్నతులు కల్పించాలని కడప మెడికల్ ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్యకు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్యలు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎన్జీవో అధ్యక్షుడు మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలోని అనంతపురం, కర్నూలు, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కడప తదితర జిల్లాల్లో మహిళాసూపర్‌వైజర్లకు పీహెచ్ఎన్‌గా, ఎంపీహెచ్ఎస్‌లకు ఎంపీహెచ్ఈవో, హెల్త్ ఎడ్యుకేటర్‌లకు డిప్యూటీ డెమోలుగా సీనియర్ ఫార్మసీలను చీఫ్ ఫార్మసీ అధికారులుగా, ఏఎన్ఎంలను ఎంపీహెచ్‌ఏలుగా, ఎంపీహెచ్‌ఏల నుంచి ఎంపీహెచ్ఎస్‌లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. పదోన్నతుల కల్పించే విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే చాలా మందికి పదోన్నతులు రాక నిరీక్షించి రిటైర్మెంట్ అవుతున్నారని మెడికల్ ఆర్డీకి విన్నవించారు. సీనియార్టీ లిస్టు రెడీ చేసి, త్వరలో పదోన్నతులకు కృషి చేస్తామని మెడికల్ ఆర్డీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మనాభరావు, కంబదూరు, మధుబాబు, ఆది బయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నర్సాపురం బాలిక



కాశినాయన అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కె.భాగ్యలక్ష్మి అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు గురయ్య తెలిపారు. మండల, నియోజకవర్గ పోటీల్లో నెగ్గిన భాగ్యలక్ష్మి కడపలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచింది. దీంతో త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ఆడనున్నారన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని ఎంఈవోలు మహమ్మద్ షఫీ, పాఠశాల ఉపాధ్యా యులు అభినందించారు.

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. పడాల రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టం 1996ను అమలు చేసి, పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిపోయినా సంక్షేమ బోర్డును పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నాయకులు పాల్గొన్నారు.


సుందరీకరణ పనులు వేగవంతం చేయండి



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని మార్గాల సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి అధికారులు ఆదేశించారు. సోమవారం కడప నగరం మాసాపేట సర్కిల్ నుంచి దర్గా వరకు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ మరమ్మత్తులు, రోడ్లలో గుంతలు పూడ్చడం, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయడంపై అధికారులను ఆదేశించారు. వైపీ స్ట్రీట్, వన్‌టౌన్ సర్కిల్ పరిసరాల్లో పర్యటించి అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన కమిషనర్ పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విజయ్‌కుమార్, ధనలక్ష్మి, హార్టికల్చర్ ఏడీ నాగమణి, డిప్యూటీ ఈఈ కృష్ణకుమార్, ఏఈలు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులురెడ్డి, పూర్ణచంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి



అవినీతిపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు పేర్కొన్నారు. ఆర్టీపీపీలో సోమవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, ఏపీ జెన్‌కో ఎండీ, ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు అవినీతికి సంబంధించి చీఫ్ ఇంజినీర్ అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణయ్య, ఫ్యాక్టరీ మేనేజర్ సిద్దయ్య, విజిలెన్స్ సీఐ నారాయణయాదవ్, ఎస్ఈలు, ఇంజినీర్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తం



ప్రాజెక్టు వద్ద నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొండాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉండటంతో ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.5 టీఎంసీల నీటిమట్టం ఉందన్నారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 4750 క్యూసెక్కులు ఉండగా, మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కులు వదులుతున్నామన్నారు. తుఫాన్ ముగిసే వరకు ప్రాజెక్టు వద్దనే నిద్రించనున్నట్లు ఆయన తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఈ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరంజలాశయం నుంచి పెన్నాకు నీరు విడుదల

మైలవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 4,300 క్యూసెక్కుల నీటిని సోమవారం సాయంత్రం నుంచి విడుదల చేస్తున్నట్లు ఆ జలాశయ అధికారులు తెలిపారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి అయిదు వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోందని, దీంతో ఉత్తర, దక్షిణ కాలువలకు 200 క్యూసెక్కులు, పెన్నాదికి 4,300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మైలవరం పూర్తి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.076 టీఎంసీల నీరు నిలువ ఉంది. పెన్నా పరివాహక ప్రాంత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు, పోలీసులు తెలిపారు.

మెగా డీఎస్సీ-25లో న్యాయం చేయాలి

- పాఠశాల విద్యా కమిషనర్‌కు లేఖ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో తనకు న్యాయం చేయాలని డీఎస్సీ అభ్యర్థి మూడే జగదీష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల విద్య కమిషనర్ కోన శశిధర్‌కు ఈ-మెయిల్ ద్వారా లేఖను పంపించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీ 2025కు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కాల్ లెటర్ వచ్చినప్పటికీ, గ్రీవెన్స్ ద్వారా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ జనరల్ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో రోస్టర్ లోపాల కారణంగా తనకు అన్యాయం జరిగిందని తెలిపారు. రోస్టర్ పాయింట్-58లో మహిళా అభ్యర్థిని నియమించడం వల్ల తాను రెండో అర్హుడిగా ఉన్నప్పటికీ విస్మరించారని తెలిపారు. జీవో నెంబర్ 77 ప్రకారం క్యారీ ఫార్వర్డ్ పోస్టుల విధానం స్పష్టంగా లేనందున తనకు న్యాయం చేయాలని విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలి

- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్చలు జరపాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కోరారు. సోమవారం జరిగిన రీజియన్ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మంత్రి చొరవ చూపాలన్నారు. ఆరు సంవత్సరాలుగా విద్యారంగం పాఠశాల విద్యాశాఖ ప్రయోగాలకు నెలవుగా మారిందన్నారు. తిరోగమన విద్యా విధానాలు ప్రభుత్వ పాఠశాల విద్యా రంగాన్ని బలహీనపరస్తూ, ఉపాధ్యాయుల సంఖ్య కుదిస్తూ ప్రైవేటు, కార్పొరేటుకు ఊతమిచ్చేలా ప్రభత్వ విధానాలున్నాయన్నారు. ఈ ప్రభుత్వంలో అయినా మంచి జరుగుతుందని ఆశించామని ఎటువంటి అనుకూల నిర్ణయాలు ఇంతవరకు వెలుడవలేదన్నారు. సానుకూల వాతావరణంలో మంత్రి చర్చలు జరపాలని కోరారు. నాయకులు సురేస్‌బాబు, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాబు, సంగమేశ్వర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై విచక్షణా రహితంగా దాడి.. తీవ్ర గాయాలు

కడప క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని గంజికుంటకాలనీ గుర్రాల షెడ్డు సమీపంలో 17 ఏళ్ల బాలు డిపై అతని మేనమామ మరో వ్యక్తితో కలిసి విచక్షణారహితంగా దాడి చేశారు. నకాశ్ ప్రాంతానికి చెందిన ఇరువురు యువకులు, మరో బాలుడితో కలిసి టీవీఎస్ వాహనాన్ని దొంగతనం చేశారు. ఆ వాహనాన్ని అమ్మి వచ్చిన డబ్బులతో ఇతర ప్రాంతాలకు వెళ్లి జల్సా చేశారు. తరవాత బాలుడిని వదిలేసి మిగిలిన ఇద్దరు కడపకు వచ్చారు. దీంతో బాలుని గురించి బంధువులు ఆరా తీశారు. పోలీసులను ఆశ్రయించి ఇతర ప్రాంతంలో బాలుడు ఉన్నాడని తెలుసుకుని అక్కడికి వెళ్లి తీసుకువచ్చారు. తరువాత తమ బాలుడు ఇంటి నుంచి వెళ్లడానికి కారణమైన వారిపై దారుణంగా దాడి చేయడంతో ఆసంఘటనను సెల్‌ఫోనులో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో కాస్త వైరల్‌గా మారింది. దీంతో మా బిడ్డను మీ వాడే తీసుకెళ్లాడని.. ఇంకో బాలుడి బంధువు తీసుకెళ్లిన బాలుడి మేనమామకు చెప్పాడు. దీంతో ఆ బాలుడి మేనమామతో పాటు మరో బాలుడి బంధువు కూడా ఆ బాలున్ని చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఖాదర్, మున్నా, ముబారక్‌పై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు.

సగిలేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అట్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడిశెట్టిపల్లె గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన చిన్నపెంచలయ్య ఉరఫ్ ప్రభాకర్ శనివారం సగిలేరులో జారి పడిన విషయం విదితమే. సోమవారం ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైె నట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఆదివారం బోడిశెట్టిపల్లె గ్రామానికి చెందిన కోట నాగమ్మ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు చిన్నపెంచలయ్య డప్పు వాయించేందుకు వెళ్లాడు. అంత్యక్రియలు పూర్తయిన తరువాత కాళ్లు కడుక్కునేందుకు సగిలేరు వద్ద నీటిలో దిగగా ప్రమాదవశాత్తు జారి పడి గల్లంతయ్యాడు. స్థానికులు సమాచారం మేరకు వెంటనే ఫైర్ సిబ్బంది బోటు సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడేవరకు వెతికినా మృతదేహం లభ్యం కాలేదు. సోమవారం తిరిగి జరిపిన గాలింపు చర్యల్లో గల్లంతైన చిన్నపెంచలయ్య మృతదేహం లభించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఐదుగురు సంతానం కలరు. కార్యక్రమంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బద్వేలు సీఐ క్రిష్ణయ్య, ఫైర్ ఎస్ఐ చంద్రుడు, సిబ్బంది ఉన్నారు.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య

అట్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరాజు పల్లె గ్రామానికి చెందిన కె.సుబ్బారెడ్డి (45) విషద్రావణ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామక్రిష్ణ వివరాల మేరకు... సుబ్బారెడ్డి కొద్దిరోజుల క్రితం కరెంటు స్తంభంపైకి ఎక్కి విద్యుత్ వైరు పరిశీలిస్తుండగా జారి పడడంతో అతని వెన్నెముక దెబ్బ తింది. దీంతో అతను మంచానికే పరిమితమయ్యాడు. ప్రతి రోజూ తన పరిస్థితిని చూసి కలతచెందేవాడు. ఈ క్రమంలో సోమ వారం మద్యం తెప్పించుకుని అందులో విషద్రావణం కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంత కష్టం..ఏమిటీ నిర్లక్ష్యం..?

● రోడ్డంతా గుంతలు ● వాహనదారులకు గాయాలు ● వాహనాలకు మరమ్మతులు


రాజానగర్ వద్ద పెద్ద గొయ్యి


మారావారిపల్లె-మాధవరంపోడు మధ్య ప్రధాన రహదారి దుస్థితి


మైసూరివారిపల్లె వద్ద గులకరాళ్లు బయటపడిన దృశ్యం


మైసూరివారిపల్లె సమీపంలో...


రాజంపేట మార్గంలో మంగంపేట వద్ద... కొర్లకుంట సమీపంలో దెబ్బతిన్న రోడ్డు... మాధవరంపోడు వద్ద గుంతలు

రైల్వేకోడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు బాగుంటే ప్రయాణం సజావుగా సాగుతుంది.. హాయిగా గమ్యస్థానాలకు చేరుకుంటాం.. అదే రహదారి గుంతలమయమైతే.. అటు వాహనదారులకు, ఇటు ప్రయాణికులకు నరకమే.. ఈ దుస్థితికి తిరుపతి - రాజంపేట ప్రధాన రహదారి అద్దపడుతోంది. రైల్వేకోడూరు నుంచి తిరుపతికి వెళ్లే పలువురు ద్విచక్రవాహనదారులు ఆ గుంతల్లో పడి గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. కార్లు, లారీలు తదితర పెద్ద వాహనాలకు టైర్లు పగిలిపోతున్నాయని, వాహనాల షాకాబ్జర్లు దెబ్బతినడంతో వేలాది రూపాయలు ఖర్చు అవుతోందని వాహన యజమానులు అంటున్నారు. రైల్వేకోడూరు నుంచి రాజంపేటకు వెళ్లే ప్రధాన రహదారి మంగంపేట, కొర్లకుంట, ముక్కావారిపల్లె, చిన్నఓరంపాడు, రెడ్డిపల్లె, పుల్లంపేట రాజంపేట వరకు గుంతలు ఏర్పడ్డాయి. అలాగే రైల్వేకోడూరు-తిరుపతి మార్గంలో మైసూరివారిపల్లె పంచాయతీ రాజానగర్ నుంచి ఉప్పరపల్లె, కుక్కలదొడ్డి వరకు పూర్తి స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి. ప్రధాన దారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతినడంతో సుమారు 20 మంది గాయపడ్డారు. తిరుపతి మార్గంలో 24 మంది, మాధవరంపోడు పరిధిలో ఆరుగురు, మైసూరివారిపల్లె పరిధిలో 10 గాయపడ్డారని స్థానికులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఇదే ప్రధానదారుల్లో గుంతలు పడినా పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధానదారుల్లో ఏర్పడిన గుంతలను పూడ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ఒక గంట ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'మొంథా' విపత్తును తప్పించుకుందాం



రైల్వేకోడూరు: జలమయమైన రంగనాయకులపేట రోడ్డు.. రామాపురం: మాట్లాడుతున్న ఏవో నాగమణి

రామాపురం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో మొంథా తుఫాన్ ముప్పును ఎదుర్కొందాం అని వ్యవసాయ అధికారిణి నాగమణి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. అవసరమైతే కంట్రోల్ రూమ్ 9441636606కు లేదా సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

రైల్వేకోడూరులో వర్షం

మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం రైల్వేకోడూరులో వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. పాదచారులు ఇక్కట్లు పడ్డారు. ఒక మోస్తారుగా గుంజననది ప్రవహిస్తోంది. తుఫాను నేపథ్యంలో రైల్వేకోడూరులో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. కంట్రోల్ రూం నెంబరు 9100283994కు ఫోన్ చేయాలన్నారు.

పెనగలూరు: తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు మండల వ్యాప్తంగా తుంపర జల్లులతో వర్షం కురుస్తోంది.

రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో రాయచోటి నియోజకవర్గం రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. తుఫాన్ కారణంగా కరుస్తున్న వర్షాలతో రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామం గుంటిమడుగు పెద్దచెరువుకు గండి పడడంతో సోమవారం ఆయన చెరువు వద్దకు వెళ్లి మరమ్మతులను పరిశీలించారు.

సుండుపల్లె: పింఛా ప్రాజెక్టు, కుంటలు, చెరువుల వద్ద ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌జాన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ తెలిపారు. మండలంలోని రాతిచెరువు, అప్పన్నకుంటతో పాటు పలు చెరువుల వద్ద పనులు నిర్వహించారు.

టీడీపీ నాయకుడు మాలేపాటి సురేశ్‌నాయుడు సహకారంతో సుండుపల్లె-2 సచివాలయం వద్ద 200 ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు. బాహుదానది, పింఛా నది పరివాహక ప్రాంతంలోకి ఎవరు వెళ్లకూడదని కోరారు.

చిట్వేలి: చిట్వేలి జిల్లా ఉన్నత పాఠశాలలో బాధితులకు పునరావాసం ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు బాధితులకు తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ఒంటిమిట్ట: తుఫాను పరిస్థితులపై మండలంలోని ముంపు ప్రాంతమైన పెన్నపేరూరు ప్రాంతాన్ని ఎంపీడీవో సుజాతమ్మ పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

తుఫాను సహాయక చర్యలకు సిద్ధం

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాను ప్రభావంతో ఏర్పడే అనర్థాలను ఎదుర్కొనేందుకు సిబ్బందిని సిద్ధం చేసినట్లు సంబేపల్లె ఎంపీడీవో కలీముల్లాబేగం తెలిపారు. వీరు 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు.

సిద్ధవటం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తుఫాను బాధితులకు పునరావాసం ఏర్పాటు చేశామని ఎంపీడీవో ఫణి రాజకుమారివారి తెలిపారు. అలాగే తహసీల్దారు తిరుమల బాబు పెన్నానదిలో ఎవరూ దిగరాదన్నారు.

'మొంథా'ను కలిసికట్టుగా ఎదుర్కొందాం : చమర్తి

రాజంపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను విపత్తును అధికారులు, పార్టీ నాయకులు కలిసి సమర్థవంతంగా ఎదుర్కొందామని రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండల అధ్యక్షుడు క్లస్టర్ ఇన్‌చార్జి, బూత్ ఇన్‌చార్జిలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలన్నారు.


మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి : టీడీపీ


అభివృద్ధిపై చర్చలు జరుపుతున్న సాయివికాస్‌రెడ్డి

రైల్వేకోడూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో రైల్వేకోడూరు మేజర్ పంచాయతీని సమగ్రంగా అభివృద్ధి చేద్దామని టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక కూటమి నాయకులతో చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో అధికారులు, కార్యకర్తలు, నాయకుల సహకారం కావాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు సూరపురాజు సుబ్బరాజు, మలిశెట్టి మురళీధర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఫైర్ బ్రాండ్ బుజ్జమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, కూటమి యువ నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, పోతురాజు సుమన్, పోకల మణి, పోతురాజు అమరేంద్ర తదితరులతో సాయివికాస్‌రెడ్డి విడివిడిగా చర్చలు జరిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పుల్లంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న మారమ్మతల్లి ఆలయ అభివృద్ధికి పుల్లంపేటకు చెందిన బుదారపు క్రాంతికుమార్ సోమవారం రూ.30 వేలు నగదును విరాళంగా ఇచ్చారు. తన తల్లి జ్ఞాపకార్థం తండ్రి వెంకటరమణ చేతులమీదుగా ఆయన నగదును దేవస్థాన కమిటీకి అందజేశారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గురవయ్య

ఒంటిమిట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నట్లు గురవయ్య(సింహాద్రి) తెలిపారు. పార్టీ మండల మహిళా అధ్యక్షురాలిగా విజయకుమారిని నియమించాలన్నారు.

సమసమాజ నిర్మాణం సీపీఎంతోనే సాధ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): దోపిడీ రహిత సమసమాజ నిర్మాణం సీపీఎంతోనే సాధ్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డీ. రమాదేవి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ, రాష్ట్ర కార్యనిర్వర్గ సభ్యురాలు రమాదేవి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


రైల్వేకోడూరు:స్వామి,అమ్మవార్లకు అలంకరణ.. కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రైల్వేకోడూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం సందర్భంగా రైల్వేకోడూరు నడిబొడ్డున వెలసి ఉన్న శ్రీభుజంగేశ్వరుడు, భువనేశ్వరి అమ్మ వారికి భక్తులు విశేషంగా పూజలు చేశారు. ఆలయ అర్చకులు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, దూర్జటి యోగీ స్వామి పూజలు చేశారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

గాలివీడు: గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. భక్తి, ఆరాధన, ఆధ్యాత్మికతతో నిండిన కార్తీక సోమవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలో వెలిసిన సర్వమంగళాదేవి, రామలింగేశ్వరస్వామికి సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు హరిస్వామి స్వామి రుద్రాభిషేకం, కలశ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ఆలయ ప్రాంగణమంతా దీపారాధనతో కళకళలాడింది.

నందలూరు : మండలంలోని పొత్తపి, టంగుటూరు, చింతకాయలపల్లె, లేబాక, నందలూరులోని ఉల్లంగేశ్వరస్వామి, నారాయణరాజుపేటలోని ఆలయాలకు భక్తులు చేరుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

చిట్వేలి: స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గుండాలకోన కర్కటేశ్వరాలయం, పాత చిట్వేలి, వీరభద్రస్వామి, వరదరాజుల స్వామి, నక్కలపల్లె, భవానిశంకర్, మూలరోడ్డు, పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, అనుంపల్లె శివాలయాల్లో పూజలు చేశారు.

ఒంటిమిట్ట:ఒంటిమిట్ట సమీపంలోని మృకుండాశ్రమం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునుంచి బారులుతీరి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆక్టోపస్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

ఒంటిమిట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రెండో అయోధ్యగా పేరుగాంచి ఒంటిమిట్ట కోదండరామాలయం సమీపంలో ఆక్టోపస్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. కోదండరామాలయానికి విచ్చేసే భక్తులకు విపత్కర పరిస్థితుల నుంచి రక్షించేందుకు ఆక్టోపస్ ఆధ్వర్యంలో విన్యాసాలు చేశారు. ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ గోపిచంద్, తహసీల్దారు దామోదర్ రెడ్డి, సీఐ బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఆలయ విజిలెన్స్ అధికారి గంగులయ్య, మండల అధికారులు టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ

చెరువుల్లోకి నీరు వచ్చేలా చూడాలి

ఓబులవారిపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పెద్దఓరంపాడు చెరువుకు నీరు వచ్చేలా చూడాలని చెరువు నీటి సంఘం అధ్యక్షుడు చాపలమడుగు సుబ్బానాయుడు, ఉపాధ్యక్షుడు ఓరుగంటి ధర్మతేజ అధికారులను విన్నవించారు. శేషాచల అడవుల నుంచి వచ్చే నీరు గాదెల అడవుల నుంచి చిన్నఓరంపాడు పరిధిలోని పాములేరుగుండా ప్రవహిస్తాయి. ఆ నీరు పెద్దఓరంపాడు చెరువులోకి చేరడంతో వందలాది ఎకరాల భూములకు సాగునీరు అందుతాయన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

పుల్లంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం కడపలో జరిగిన వాలీబాల్ ఎంపిక పోటీల్లో 300 మంది విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అండర్-17 విభాగంలో కొత్తపేట పాఠశాల పదో తరగతి విద్యార్థి ఓంకార్, అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని నాగిరెడ్డి హారిక ఎంపికయ్యారని పీడీ డాక్టర్ బాలశేఖర్, సాయిరాం తెలిపారు.

గంగమ్మ తల్లి సేవలో నాయకులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంటకాపురంలో నిర్వహించిన గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చెంద్రాయుడు, రాయలసీమ కన్వీనర్ జోగినేని మణి, జనసేనపార్టీ సీనియర్ నాయకులు ఆలం రమేష్ హాజరయ్యారు.

ఎస్పీకి స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతల వినతి

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని డైట్ కళాశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్స్ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని సోమవారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి విన్నవించారు. తుఫాను నేపథ్యంలో సహాయక చర్యలు అందించేందుకు స్కౌట్ గైడ్స్ యూనిట్ లీడర్లు సిద్ధంగా ఉన్నారన్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని బాలికపై కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన బాలిక కుటుంబాన్ని పరామర్శించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

● టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 50 మంది లబ్ధిదారులకు సుమారు రూ.50 లక్షల విలువల గల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాయచోటి నియోజకవర్గంలో సుమారు 800 మంది లబ్ధిదారులకు రూ.6 కోట్లకు పైగా సీఎం సహాయనిధి అందజేశామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, లయన్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు ఈవోపీఆర్డీగా శ్రీకాంత్

పెనగలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):పెనగలూరు మండల పరిషత్ ఈవోపీఆర్డీగా సోమవారం శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. ఈయన రాజంపేట మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై పెనగలూరుకు బదిలీ అయ్యారు. ఈయన గతంలో పెనగలూరు మండలంలో వీడీవోగా పని చేశారు.

కోడిపందెం స్థావరాలపై దాడి

పెనగలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగరాజపురం పంచాయతీ పరిధిలో సోమవారం సాయంత్రం కోడిపందెం ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి.రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. వారివద్ద నుంచి రూ.4050 నగదు, మూడు కోడిపుంజులు, 36 కోడి కత్తులు, 6 మోటారు బైకులు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో కోడిపందెం స్థావరాలపై దాడులు చేసినట్లు తెలిపారు.

అనధికార లే-అవుట్ల
క్రమబద్ధీకరణ గడువు పెంపు


రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని అనధికార లే-అవుట్ల క్రమబద్ధీకరణ గడువును 23 జనవరి 2026 వరకు పొడగించినట్లు ఏపీవో కృష్ణసింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువు లోపు క్రమబద్ధీకరణ చేసుకోని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజ కవర్గంలోని పుల్లంపేట-3, పెనగలూరు-2, చిట్వేల్-1, కోడూరు మండలంలో 19 అనధికార లే-అవుట్‌లను గుర్తించినట్లు తెలిపారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి జాడేదీ..?

● మున్సిపల్ పాలకమండలి సమావేశంలో అధికారులపై నాయకుల ధ్వజం

రాజంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సి పాలిటీలో అభివృద్ధి ఏదీ అని పలువురు జ్వధమెత్తారు. రాజంపేట మున్సిపల్ పాలకమండలి నెలసరి సాధారణ సమావేశం సోమవారం వినూత్నంగా జరిగింది. వైసీపీ పాలకమండలి నాయకులు ఏకంగా ప్రతిపక్ష పాత్ర పోషించి అధికారులు ఏ పనులు చేయడంలేదని, అభివృద్దే జరగలేదని పేర్కొన్నారు. సమావేశం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన నిర్వహించగా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి జరగడం లేదన్నారు. కమిషనర్ శ్రీనివాసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. సీనియర్లను పక్కనబెట్టి అవినీతి ఆరోపణలు ఉన్న శివారెడ్డి అనే జూనియర్‌ను ఆర్‌ఐగా నియమించుకున్నారని, వెంటనే అతన్ని తొలగించాలని పేర్కొంటూ కౌన్సిల్ హాలులో నేలపై కూర్చొని నిరసన తెలిపారు. కౌన్సిలర్ కూండ్ల రమణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పార్కు వద్ద పైపులైను కోసం రోడ్డును తవ్వి పట్టించుకోలేదన్నారు. మున్సిపల్ చైర్మన్ సోదరుడు, కౌన్సిలర్ పోలా రమణారెడ్డి మాట్లాడుతూ అధికారుల తీరు దారుణమన్నారు. కౌన్సిలర్లు మనుబోలు విజయలక్ష్మి, సూరిబాబు, పసుపులేటి సుధాకర్, రాఘవేంద్ర, ననిశెట్టి నవీన్, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడరు తుపాకుల అశోక్ మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటీలో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. కమిషనర్ శ్రీనివాసులు, టౌను ప్లానింగ్ అధికారి రెహమాన్, ఆర్ఐ శివారెడ్డి ఆధ్వర్యంలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. కౌన్సిలర్ సూరిబాబు మాట్లాడుతూ మున్సిపల్ రూము బాడుగలు రూ.30 లక్షలు మార్కెట్ ఇతర గేట్లు పాడేందుకు వచ్చే సొమ్ము ఏమైందని ప్రశ్నించారు.


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నేలపై బైఠాయించిన మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



జగదాంబసెంటర్ వీధిలో వర్షానికి రోడ్లపైకి వచ్చిన మురుగునీరు

రాయచోటి పట్టణంలోని ఠానా సమీపంలో మురుగునీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తూ కనిపిస్తుంది. చిన్నపాటి వర్షం పడినా మురుగు మొత్తం రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ఇప్పటి వరకు దాదాపు పది మంది కమిషనర్లు విధులు నిర్వహించినా ఏ ఒక్కరూ మున్సిపాలిటీని పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో భారీ వర్షాల కారణంగా మురుగు కాలువలు పొంగి నలుగురి మృతికి కారణమైన విషయం విదితమే..

- అస్తవ్యస్తంగా మురుగు కాలువల వ్యవస్థ
- విచ్చలవిడిగా కాలువల ఆక్రమణ
- రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు
- అభివృద్ధికి సహకరించని నాయకులు
- అధికారుల్లో నిర్లిప్తత

వానొస్తే.. వరదే..!

రాయచోటి - కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే రాయచోటి పట్టణంలో వాగులు ప్రవహిస్తున్నాయి. గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా ఉండడంతో ఎంత వర్షం పడినా ఎక్కడికక్కడ నీరు బయటికి వెళ్లిపోయేది. 2005లో మున్సిపాలిటీగా మారినప్పటి నుంచి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది.

రాయచోటి పట్టణంలో 40 వేల జనాభాకు తగిన సామర్థ్యంతో అక్కడక్కడ డ్రైనేజీలు నిర్మించారు. అవే ఇప్పుడూ ఉపయోగంలో ఉన్నాయి. 2012లో పీఎల్ఆర్ కంపెనీ వాళ్లు రూ.17 కోట్లతో రాయచోటి మున్సిపాలిటీలో మురుగు కాలువల నిర్మిస్తున్నామని చెప్పి కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే నిర్మించి చేతులు దులుపుకున్నారు. జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి పరిస్థితి మరీ దారుణంగా మారింది. జిల్లా అధికారులు ఉన్నా పట్టణంలో రోడ్లు, మురుగు కాలువల వంటి కనీస వసతులు కల్పించాలన్న విషయం విస్మరించారని ప్రజలు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ. 340 కోట్లతో అండర్ డ్రైనేజీ వేస్తున్నామని హంగామా చేసిన నాయకులు, అధికారులు ఎక్కడో ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో రెండు, మూడు కిలోమీటర్లు మాత్రమే వేసి.. చేతులు దులుపుకున్నారు.ఇప్పటికైనా అధి కారులు, నాయకులు స్పందించి, డ్రైనేజీ, సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

పదేళ్ల నుంచీ ఇదే పరిస్థితి..

రాయచోటి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ దాదాపు పదేళ్ల నుంచి పూర్తిగా దెబ్బతినింది. టౌన్ ప్లానింగ్ విభాగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే తప్ప ఈ మున్సిపాలిటీ గాడిలో పడే పరిస్థితి లేదు. గతంలో ఇక్కడ పనిచేసిన టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యమే డ్రైనేజీ వ్యవస్థ దుస్థితికి కారణం. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలను ఆక్రమించి మరీ ఇళ్లు కడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇష్టానుసారం ఇళ్ల నిర్మాణం, మురుగు కాలువల పూడ్చివేత, కాలువలపైన ఇళ్ల



స్వల్ప వర్షానికే బురదమయమైన బస్టాండు రోడ్డు

రాయచోటి పట్టణంలో ఎక్కువగా ఉన్నాయి. రూ. 3 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు సహకరించమని కౌన్సిల్‌ను పదిసార్లు అడిగినా అంగీకరించకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నాం. పట్టణ అభివృద్ధికి సహకరించని ప్రజాప్రతినిధులు ఉంటే అధికారులు మాత్రం ఏం చేస్తారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రవి మృతదేహం

రాయచోటిటౌన్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటోను బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంబేపల్లె మండలం దిన్నెపల్లెకు చెందిన రవి (22) సోమవారం తన స్నేహితులను ద్విచక్రవాహనంపై రాయచోటి రింగురోడ్డు వద్ద దించి, మరో స్నేహితుడికోసం రాయచోటికి వస్తుండగా ఎస్ఆర్ కల్యాణ మండపం సమీపంలో ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా కుడి వైపు తిప్పడంతో వెనుకే వస్తున్న రవి ఆటోను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని స్థానికులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రాయచోటి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి 7 నెలల జైలు



ముద్దాయి అరవింద్

రైల్వేకోడూరు, రూరల్ అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడికి ఏడు నెలల జైలు శిక్ష ఖరారు చేస్తూ సోమవారం రైల్వేకోడూరు కోర్టు న్యాయమూర్తి తేజసాయి తీర్పునిచ్చినట్లు రైల్వేకోడూరు అర్బన్ సీఐ కే. హేమ సుందరరావు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం, అబ్దుల్లాపురానికి చెందిన మాదిగ అరవింద్ రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ట్రాక్టర్, మోటారు సైకిల్‌ను దొంగిలించాడని, ఈ రెండు కేసుల్లో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ట్రాక్టర్ దొంగతనం కేసులో నాలుగు నెలలు, మోటారు బైక్ దొంగతనం కేసులో మూడు నెలల జైలు శిక్ష విధించారని తెలిపారు. నిందితుడిని రాజంపేట జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడదలచిన వారికి హెచ్చరికగా నిలుస్తుందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమ వారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం, తట్టివారిపల్లె సమీపం లోని చెరువుకట్ట వద్ద శనివారం సాయంత్రం మదనపల్లె మండలం, వలసపల్లె, మొలకలదిన్నెకు చెందిన ఎరుకల శ్రీనివాసులు (35) కురబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన ఆనంద కుమార్ (27)ను అదుపులోకి తీసున్నామని, వీరికి గంజాయి సరఫరా చేస్తున్న మదనపల్లెకు చెందిన సయ్యద్ జాఫర్ అలీ, శివకుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయి, ఒక పల్సర్ బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎరుకల శ్రీనివాసులుపై మదనపల్లె తాలూకా, టూటౌన్, ముదిగుబ్బ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి విద్యార్థి ఆత్మహత్యా యత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కురబలకోటకు చెందిన నాగరాజ కుమారుడు ప్రదీప్(19) మదనపల్లెలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. సక్రమంగా చదవడంలేదని కుటుంబ సభ్యులు మందలించడంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు అతనిఇ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 ద్విచక్ర వాహనాలు సీజ్



ముదివేడు పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మైనర్లు నడుపుతున్న 25 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని అంగళ్లులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ముఖ్యంగా మైనర్లు, యువత అతి వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి - నేతాజీ సర్కిల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం- పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారాన్ని నేరుగా పర్యవేక్షిస్తోందన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రాయచోటి బోస్ నగర్‌కు చెందిన షేక్. షబానాకు ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించినట్లు హెచ్ఏఎస్ఎఫ్ 230525042284గా ఆన్‌లైన్‌లో చూపుతున్నదని, కానీ ఆమెకు ఇప్పటి వరకు ఎలాంటి పట్టా ఇవ్వలేదని, ఈ విషయాన్ని పరిశీలించి ఇంటి స్థలాన్ని ఇప్పించాల్సిందిగా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. తన భర్త 2009, సెప్టెంబరు 3న మరణించాడని, తనకు మంజూరైన వితంతు పింఛనును ఈ మధ్య కాలంలో నిలిపేశారని, దానిని పునరుద్ధరించాలని నిమ్మనపల్లిపరిధిలోని కొండయ్యగారిపల్లెకు చెందిన రాజమ్మ విన్నవించుకున్నారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్ అర్జీలు స్వీకరించారు.

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

- జిల్లా సాధన సమితి డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి నాయకులు

మదనపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ కొలిక్కి రావడం హర్షణీయమని, మంగళవారం జరిగే మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించేందుకు మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం సీఎంతో భేటీ అవుతున్న నేపథ్యంలో సోమవారం స్థానిక బాస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెను జిల్లా కేంద్రం చేసేందుకు సాధ్యాసాధ్యాలపై నివేదికలో వివరించనున్నట్లు వెల్లడైన విషయం ఇక్కడి ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఇలాంటి అపోహలకు, ఆందోళనలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా మంగళవారం ఉపసంఘంతో జరిగే భేటీలో సీఎం ప్రకటన చేసి స్పష్టత ఇవ్వాలని కోరారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో పాటు యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల ప్రజల విజ్ఞప్తి మేరకు ఆ రెండు మండలాలను కూడా మదనపల్లె జిల్లాలో కలపాలని కోరారు. మంగళవారం మదనపల్లెలో నిర్వహించతలపెట్టిన బిగ్ డిబేట్‌ను తుఫాను కారణంగా నవంబరు 4వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె సాధన సమితి కోకన్వీనర్ రెడ్డిసాబ్, తోపు కృష్ణప్ప, శ్రీచందు, దుగ్గిరెడ్డి ప్రభాకర్, బాస్ నాయకులు తలారి కృష్ణ, గంగాధర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుదాం..!

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల్లో సత్తా చాటుదామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ నేతలతో కలసి మండలంలోని కన్నెమడుగు, రేణుమాకులపల్లె, ఎద్దులవారిపల్లెల్లో ముమ్మరంగా పర్యటించారు. పలువురు నేతలను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఎవ రికి ఏ సమస్య వచ్చినా అండగా నిలబడి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వర్గాలు వీడి అందరం కలసికట్టుగా పనిచేసి వచ్చే సంస్థాగత ఎన్నికల్లో శత శాతం కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసి తంబళ్లపల్లెలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొద్దామన్నారు. మాజీ గ్రామాధ్యక్షుడు బోయపల్లె శివ, మునాఫ్, సిద్దారెడ్డి, బాసూసాబ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో కేదారేశ్వర వ్రతం





ప్రత్యేక అలంకారంలో అఘోర లింగేశ్వరుడు,కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా కేదారేశ్వర స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నాగేశ్వరస్వామి, కేదారేశ్వర వ్రత పూజా విధానము, పూజా విశిష్టత భక్తులకు వివరించారు. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు, కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అఘోరలింగేశ్వర స్వామి ఆలయంలో వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

గుండాలకోనకు రావద్దు

- భక్తులకు సీఐవిజ్ఞప్తి

చిట్వేలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో గుండాలకోన కర్కటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు రావద్దని సీఐ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. కోన నుంచి నీరు ఉధృతంగా వచ్చే అవకాశం ఉన్నందున, చుట్టుపక్కల వంకల్లో ప్రవాహం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందువల్ల కోన సందర్శనను వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భక్తులను ఇతర ప్రాంతాలకు తరలించామని వివరించారు. కొత్తగా ఎవరూ వచ్చేందుకు ప్రయత్నించరాదని తెలిపారు.

పీహెచ్‌సీలో మలేరియా అధికారి తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్ స్థితిగతులు, రికార్డులు, ల్యాబ్ నెలవారీ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాధామాధవి, శైలజ, సబ్-యూనిట్ విద్యాసాగర్, సీహెచ్‌వో సరస్వతి, ఆరోగ్య పర్యవేక్షకులు చిన్నప్ప, సిబ్బంది రాజమణి, హెచ్ఈ కృష్ణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ మునీర్, ఫార్మసిస్ట్ యుగంధర్, ఆరోగ్య కార్యకర్తలు శివప్రసాద్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో కోచ్‌లు తదితరులు

రైల్వేకోడూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీవీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అండర్-19 తైక్వాండో పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎం. చంద్ర మోహన్‌రాజు, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి సీ. శారద మాట్లాడుతూ ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా అండర్ 46 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున బాలుర అండర్ 45 కేజీ విభాగంలో వరుణ్ కుమార్ (విజయనగరం), అండర్ 48 కేజీ విభాగం లో సి. గిరి (శ్రీకాకుళం), అండర్ 51 కేజీ విభాగంలో ఎస్. సాహిల్ (చిత్తూరు), అండర్ 55 కేజీ విభాగంలో బి. గౌతంకుమార్ (చిత్తూరు), అండర్ 59 కేజీ విభాగంలో ఓ. సువార్త (ప్రకాశం), అండర్ 63 కేజీ ఎం. కలవగిరి (ప్రకాశం), అండర్ 68 కేజీ బీకే చైతన్య (విశాఖపట్నం), అండర్ 78 కేజీ కే. రోహిత్‌కుమార్ (విజయనగరం), అండర్ 73 కేజీ బీ. జస్వంత్ (విజయనగరం), 78 కేజీ పీ. ధనుష్‌తేజ (ఈస్ట్‌గోదావరి)ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. బాలికల విభాగంలో అండర్ 40 కేజీ విభాగంలో ఎస్. కరిష్మా (అనంతపురం), అండర్ 42 కేజీ జి. కృష్ణకీర్తన (అనంతపురం), అండర్ 44 కేజీ పి. పూజిత (అనంతపురం), అండర్ 46 కేజీ పీఎస్ఎస్ఎస్ నిహారిక (ఈస్ట్‌గోదావరి), అండర్ 49 వి. హిమశ్రీ (విజయనగరం), అండర్ 52 కేజీ ఎస్. అక్సా (కడప), అండర్ 55 విభాగం పి. మేరీస్టెల్లా (ప్రకాశం), అండర్ 59 కేజీ కే. తేజశ్రీ (కృష్ణా), అండర్ 63 విభాగంలో బీఎల్ అక్షర (ప్రకాశం), అండర్ 68 కే. యామినిదేవి (విశాఖపట్నం) అండర్ 68 బి. హారిక (కడప) ను ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు గురుకులం విద్యార్థి



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయినులు

నందలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీసీ గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎస్.నిత్య ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి డిస్క్‌త్రో, షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ చూపి హర్యానాలో జరుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలియజేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఫస్టియర్ సీఈసీ చదువుతున్న కె.మానస రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు. ఇంటర్ విద్యార్థినులకు నీట్, జేఈఈ ప్రవేశాలకు ఈ పతకాలు ఉపయోగపడతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు కేజీ సునీతను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు పాటూరు విద్యార్థినులు



నక్షత్ర



యేసుప్రియ



శివమంజుల

నందలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కడప పట్టణంలోని మాంటిస్సోరి జగతి ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం జరిగిన అండర్ 14, అండర్ 17 బాల బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.యేసుప్రియ, బి.నక్షత్ర, అండర్-14 విభాగంలో, ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిరువురు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు, అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరచిన కె.శివమంజుల తూర్పుగోదావరి జిల్లా కోవూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవీలత మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుతూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ ఎం.సుస్మిత, పీఈటీ పి.జగన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు

పీలేరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.3కోట్లతో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ కమలాకర్ రెడ్డి, ఏఈ రామకృష్ణనాయక్ తెలిపారు. అగ్రహారం పంచాయతీకి రూ.14.25 లక్షలు, బోడుమల్లువారిపల్లెకు రూ.10లక్షలు, దొడ్డిపల్లె పంచాయతీకి రూ.22.50 లక్షలు, గూడరేవుపల్లెకు రూ.9.30లక్షలు, జాండ్లకు రూ.10లక్షలు, కాకులారంపల్లెకు రూ.9.50లక్షలు, కావలిపల్లెకు రూ.12లక్షలు, మేళ్లచెరువుకు రూ.9లక్షలు, పీలేరుకు రూ.82.70లక్షలు, రేగళ్లుకు రూ.30లక్షలు, తలపులకు రూ.34.25లక్షలు, వేపులబైలుకు రూ.21.50 లక్షలు, యర్రగుంటపల్లెకు రూ.12.50లక్షలు, ముడుపుల వేములకు రూ.12.50లక్షలు, బాలంవారిపల్లె పంచాయతీకి రూ.10 లక్షలతో సీసీ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా పనులు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

చెవిరెడ్డి పీఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా గతంలో పనిచేసిన (రేణిగుంట పంచాయతీ సెక్రటరీ) గుర్రాల శ్రీనివాసులుపై ఆయన సోదరుడి కుమారుడు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాయచోటిలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాసులు సోదరుడు గుర్రాల మణికంఠ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మణికంఠ కథనం మేరకు తమ కుటుంబానికి పీలేరు మండలం ముడుపులవేముల గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.510లో వారసత్వంగా సంక్రమించిన 4.13 ఎకరాల భూమి ఉండేదన్నారు. తల్లిదండ్రులిద్దరూ తన చిన్నతనంలోనే కన్నుమూయడంతో మేనమామ వాళ్ల దగ్గర ఉంటున్నానని తెలిపాడు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి వద్ద పనిచేస్తున్న తన పెద్దనాన్న పీలేరులోని అధికారులను భయపెట్టి ఆ భూమిని ఈనెల 21వ తేదీ తన పేరిట రిజిస్టర్ చేసుకున్నాడన్నారు. తాను, తన మేనత్తలు పలుమార్లు వేడుకున్నా తమకు న్యాయంగా రావాల్సిన భాగాలను ఇవ్వలేదన్నారు. తనకు, తన మేనత్తలకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు.

హార్సిలీహిల్స్‌లో కార్తీక వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ సెక్షన్‌ఆఫీసర్ శివకుమార్

బి.కొత్తకోట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. టూరిజం, అటవీశాఖ సిబ్బంది స్థానికులతో కలిసి కొండపై ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏనుగుమల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఏపీ టూరిజం మేనేజర్ కొల్లిశ్రీధర్‌తో కలిసి సెక్షన్ ఆఫీసర్ శికుమార్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు వృక్షాలను రక్షించాలని, ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయోమయం... గందరగోళం

- గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో వైద్యశాఖ ఉద్యోగులకు తప్పని తిప్పలు
- బదిలీలతో రెండవ ఏఎన్ఎంల పరిస్థితి అయోమయం
- ఆ జీవోలను రద్దు చేయాలంటూ ప్రభుత్వంపై వత్తిడి



కడప కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) గతంలో జగన్ సర్కారులో ప్రజలకు ఉచిత వైద్యమంటూ తీసుకొచ్చిన రీడిప్లయ్మెంట్, 143 జీవోలు వైద్యశాఖలో ఉద్యోగులను గందర గోళపరిస్థితికి నెట్టాయి. ఆజీవోలు అమలు మాట దేవుడెరుగు రెగ్యులర్ ఏఎన్ఎంలను, అరకొర జీతాలతో ఏళ్ల తరబడి రెగ్యులర్ కాని రెండవ ఏఎన్ఎంలను జిల్లా, అంతర్‌జిల్లాల బదిలీలతో వైద్యశాఖను అవినీతిమయం చేశారనే విమర్శలున్నాయి. అప్పటి ప్రభుత్వ పెద్దల పెత్తనంతో మంచీ చెడూ చెప్పకుండా డూడూ బసవన్నలా వ్యవహరించిన కొందరు అధికారులు, అప్పటి సంఘనాయకులతో ఉద్యోగులకు అన్యాయం జరిగిందని.. ప్రక్షాళన చేయాలంటూ తెలుగునాడు అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమయ్యారు. జగన్ సర్కారు తెచ్చిన రీడిప్లయ్మెంట్ విధానం రద్దుకు వైద్యశాఖలో కొన్ని విభాగాల ఉద్యోగులు కూటమి సర్కారుపై ఒత్తిళ్లు పెంచేందుకు సిద్ధమయ్యారు.

సచివాలయ వ్యవస్థతోనే తిరకాసు

వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ వచ్చింది. అప్పటి నుంచి ఏఎన్ఎంల బదిలీలు, స్టాఫ్ నర్సుల శిక్షణలంటూ ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్‌సీలలో పనిచేసే రెగ్యులర్, రెండో ఏఎన్ఎంలను, జిల్లా క్యాడర్ ఉద్యోగులను జిల్లా మారుమూలలకు బదిలీలు చేసి వైద్యశాఖలో ఉచిత వైద్యం చేయాల్సిన వారిలో వైసీపీ వ్యతిరేక విధానాలతో విసిగిపోయారు. ప్రాథమిక కేంద్రానికి 14 మంది సిబ్బంది అంటూ అశాస్త్రీయంగా 143 జీవో రీడిప్లయ్మెంట్ విధానాన్ని తెచ్చి ఆశాఖ ఉద్యోగులతో ఆడుకున్నారనే విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థను తెచ్చి అందులో మూడో ఏఎన్ఎంలను నియమించారు. అయితే ఆరోగ్య ఉపకేంద్రాలలో రెగ్యులర్, రెండవ ఏఎన్ఎంలు ఉన్నారు. సచివాలయం ఏఎన్ ఎంలను కలుపుకుంటే ఎక్కువ మంది ఉన్నారని ఆలస్యంగా గ్రహించిన అధికారులు కొంతమందిని రెండేళ్ల స్టాఫ్ నర్సు శిక్షణకు పంపారు. శిక్షణకు పంపిన వారి స్థానంలో రీడిప్లయ్మెంట్ విధా నంలో రెగ్యులర్, రెండవ ఏఎన్ఎంలను ఇష్టారాజ్యంగా 50-150 కిలోమీటర్ల దూరప్రాంతాలకు బదిలీ చేసి వైద్య ఉద్యోగుల్లో గందరగోళ పరిస్థితులు తెచ్చారంటున్నారు. వీరిలో మండలాల్లో చాలీ చాలనీ జీతాలతో పనిచేసే రెండవ ఏఎన్ఎంల పరిస్థితి దారుణంగా మారింది. ఇక పీహెచ్‌సీలకు సంబంధించి 14 మంది సిబ్బంది అంటూ 143 జీవో తెచ్చి అందులో నలుగురు పర్యవేక్షణ సిబ్బంది పేరుతో ఉత్తర్వులు జారీ చేసి నేటికి అమలు లేదు. దీంతో గత జగన్ సర్కారులో ఇచ్చిన జీవోలతో అన్ని క్యాడర్లలో ప్రమోషన్లకు గండి కొట్టారంటూ ఆందోళనబాటకు శ్రీకారం చుట్టారు.

బదిలీల్లో అవినీతికి పరాకాష్ట

వైద్య శాఖలో అన్ని క్యాడర్లను పొంతన లేకుండా నియమించి.. వైద్య ఉద్యోగుల బదిలీల్లో ఎల్‌డీసీ పోస్టుకు యూడీసీ పోస్టులతో ముడిపెట్టి వైద్య ఉద్యోగులను గందర గోళపరిస్థితులకు నెట్టారు. నాన్చుడు ధోరణిలో ప్రమోషన్లకు ఎసరు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక జిల్లా క్యాడర్‌కు, జోనల్ క్యాడర్‌కు రాష్ట్ర క్యాడర్లను జోనల్ సంచాలకులు అశాస్త్రీయమైన పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించి అప్పటి ప్రభుత్వ విధానాలకు అవినీతి ఆజ్యం పోశారంటూ విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానలను ఎండగడుతూ కూటమి సర్కారులో రీ డిప్లయ్మెంట్ విధానం రద్దుకు తెలుగునాడు వైద్య అసోషియేషన్ ఉద్యమ బాటకు సిద్ధమైంది. ఈమేరకు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల ఐక్యతతో నిరసనల ద్వారా గత ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రక్షాళన చేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నారు.

పంటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వాల్మీకిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పంటల విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ మంజుల తెలిపారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో వర్షాలతో దెబ్బతిన్న పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. వేరుశనగ, టమోటా తదితర పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. టమోటా పంటలో తెగులు, పడిపోయిన వరిపంటలో గింజలు మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం పిచికారి చేయడం వల్ల పంట నష్టం చాలా మేరకు తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విశ్వనాథ్, సంధ్యారాణి, సహజదేవ, సోమశేఖర్‌బాబు, శ్రీనివాసులు, ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు లతీఫ్‌కుమార్



మదనపల్లె టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ పోటీలకు మదనపల్లె విద్యార్థి లతీఫ్‌కుమార్ ఎంపికయ్యాడని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్‌పర్సన్ అమృత తెలిపారు. ఆదివారం నగరిలో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న లతీఫ్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడని, నవంబర్ 1వ తేదీ నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ షెహనాజ్, పీఈటీలు మహమ్మద్ అలీ, భానుప్రకాష్, రవి, శబరి అభినందించారు.

అజాగ్రత్తగా వాహనాలు నడపొద్దు

- 'స్టాప్.. వాష్ అండ్ గో'లో సీఐ రాఘవరెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాత్రి సమయాలలో ప్రయాణాల పట్ల అప్రమత్తంగా ఉంటూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయరాదని సీఐ రాఘవరెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై సీఐ రాఘవరెడ్డి పలు ప్రాంతాలలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ వాహనాలు, పాల ట్యాంకర్లు, లారీలు తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు నీళ్లు ఇచ్చి ముఖం శుభ్రం చేసుకోవాలని సూచించారు. దూర ప్రయాణాలు చేసే వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం స్టాప్.. వాష్ అండ్ గో కార్యక్రమం పట్ల అవగాహన కల్పించారు. డ్రైవర్లు రాత్రి సమయాలలో గమ్యం చేరుకునేలోపు ఒకటి, రెండు చోట్ల వాహనాలను నిలిపి ముఖం శుద్ధి చేసుకోవాలని సూచించారు.

ప్రారంభమైన బీఎడ్ పరీక్షలు



పరిశీలిస్తున్న వీసీ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధి ఉమ్మడి కడప జిల్లాలోని 17 కేంద్రాలలో బీఎడ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను 21,665 మంది విద్యార్థులు రాస్తున్నారు. తొలి రోజు కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, కేంద్రంలోని పరిసరాలను పరిశీలించారు. పరీక్షలు నిబంధనలను అనుసరించి కట్టుదిట్టంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు వివరిస్తూ రెండు జిల్లాలోని అన్ని కేంద్రాలకు విశ్వవిద్యాలయం తరపున అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. అలాగేస్క్వాడ్ బృందాల సభ్యులు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని వీసీకి వివరించారు.

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. పడాల రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టం 1996ను అమలు చేసి, పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిపోయినా సంక్షేమ బోర్డును పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నాయకులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని మార్గాల సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి అధికారులు ఆదేశించారు. సోమవారం కడప నగరం మాసాపేట సర్కిల్ నుంచి దర్గా వరకు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ మరమ్మత్తులు, రోడ్లలో గుంతలు పూడ్చడం, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయడంపై అధికారులను ఆదేశించారు. వైవీ స్ట్రీట్, వన్‌టౌన్ సర్కిల్ పరిసరాల్లో పర్యటించి అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన కమిషనర్ పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విజయ్‌కుమార్, ధనలక్ష్మి, హార్టికల్చర్ ఏడీ నాగమణి, డిప్యూటీ ఈఈ కృష్ణకుమార్, ఏఈలు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులురెడ్డి, పూర్ణచంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి



అవినీతిపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు పేర్కొన్నారు. ఆర్టీపీపీలో సోమవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, ఏపీ జెన్‌కో ఎండీ, ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు అవినీతికి సంబంధించి చీఫ్ ఇంజినీర్ అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణయ్య, ఫ్యాక్టరీ మేనేజర్ సిద్దయ్య, విజిలెన్స్ సీఐ నారాయణయాదవ్, ఎస్ఈలు, ఇంజినీర్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

- మెడికల్ ఆర్డీకి ఎన్జీవో సంఘ నేతల వినతి



కడప మెడికల్ ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

కడప కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ రీజియన్ పరిధిలోని అన్ని క్యాడర్లలోని ఉద్యోగులకు అర్హతల మేరకు పదోన్నతులు కల్పించాలని కడప మెడికల్ ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్యకు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్యలు సోమవారం వినతి పత్రం అదజేశారు. ఈసందర్భంగా ఎన్జీవో అధ్యక్షుడు మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలోని అనంతపురం, కర్నూలు, సత్యసాయి, అన్నమయ్య చిత్తూరు, తిరుపతి, కడప తదితర జిల్లాల్లో మహిళాసూపర్‌వైజర్లకు పీహెచ్‌ఎన్‌గా, ఎంపీహెచ్‌ఎస్‌లకు ఎంపీహెచ్ఈవో, హెల్త్ ఎడ్యుకేటర్‌లకు డిప్యూటీ డెమోలుగా సీనియర్ ఫార్మసీలను చీఫ్ ఫార్మసీ అధికారులుగా, ఏఎన్ఎంలను ఎంపీహెచ్ఏలుగా, ఎంపీహెచ్ఏల నుంచి ఎంపీహెచ్ఎస్‌లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. పదోన్నతుల కల్పించే విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే చాలా మందికి పదోన్నతులు రాక నిరీక్షించి రిటైర్మెంట్ అవుతున్నారని మెడికల్ ఆర్డీకి విన్నవించారు. సీనియార్టీ లిస్టు రెడీ చేసి, త్వరలో పదోన్నతులకు కృషి చేస్తామని మెడికల్ ఆర్డీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మనాభరావు, కంబదూరు, మధుబాబు, ఆది బయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు



తాలుకా పోలీసుస్టేషన్‌కు వచ్చిన పాశంవారిపల్లె గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) మదనపల్లె మండలం పెంచుపాడు గ్రామం పాశంవారిపల్లెకు చెందిన కోటూరి వెంకటప్ప, కోటూరి భరత్‌కుమార్, వరుణ సందేశ్‌ల నుంచి తమ ప్రాణాలు కాపాడాలని పాశంవారిపల్లె గ్రామస్థులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తాలుకా పోలీసుస్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది యువకులు మద్యం, గంజాయి, విచ్చలవిడిగా తాగి ప్రతి రోజు గ్రామం నుంచి స్కూల్‌కు, కళాశాలలకు వెళ్లే అమ్మాయిలను, ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చిత్రహింసలు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో కూడా ఫిర్యాదు చేస్తే పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి వెంకటప్ప, వరుణసందేశ్ మద్యం, గంజాయి మత్తులో కత్తి తీసుకుని ఇంకో ముగ్గురు భరత్, లోకేశ్, వెంకటేశ్‌ను కలుపుకుని 'నీ కూతుర్ని పంపిస్తావా లేదా చంపేయాలా అంటూ ఒంటరి మహిళ అయిన సునీతపై కత్తితో దాడి చేశారని, పక్కనే ఉన్న నవీన్ అడ్డుకోవడంతో వెంకటప్ప వారిపై దాడి చేశారన్నారు. గ్రామస్థులు 100కు ఫోన్ చేసిన అనంతరం పోలీసులు వచ్చారన్నారు. వెంటనే గాయపడిన సునీతను చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యలపై అర్జీల వెల్లువ



సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి అర్జీ అందిస్తున్న బాధితుడు

మదనపల్లె టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో రెవెన్యూ సమస్యలపై సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి వెల్లువలా అర్జీలు వచ్చాయి. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ అవసరాలకు తమ భూమి తీసుకుని ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వలేదని కలికిరికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు టి.బావాజీ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ భూమికి సంబంధించి అన్ని రికార్డులు తమ తండ్రి పేరిట వున్నా, అధికారులు వేరొకరికి పరిహారం మంజూరు చేశారని, దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని బావాజీ ఫిర్యాదు చేశారు. వలసపల్లె పంచాయతీకి చెందిన ముబారక్‌కు ఒక కాలు లేదని, అతనికి దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, బాధితుడితో కలసి సబ్‌కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. తనకు 70శాతం వికలత్వం వున్నా అధికారులు పింఛన్ మంజూరు చేయలేదని బసినికొండకు చెందిన ఆనంద్, వీటితో పాటు మ్యుటేషన్‌లు, 22-ఏ జాబితా తొలగింపులు, సర్వే సమస్యలపై పెద్దఎత్తున ప్రజల నుంచి అర్జీలు వచ్చాయి. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

మెగా డీఎస్సీ-25లో న్యాయం చేయాలి

- పాఠశాల విద్యా కమిషనర్‌కు లేఖ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో తనకు న్యాయం చేయాలని డీఎస్సీ అభ్యర్థి మూడే జగదీష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల విద్య కమిషనర్ కోన శశిధర్‌కు ఈ-మెయిల్ ద్వారా లేఖను పంపించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీ 2025కు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కాల్ లెటర్ వచ్చినప్పటికీ, గ్రీవెన్స్ ద్వారా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ జనరల్ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో రోస్టర్ లోపాల కారణంగా తనకు అన్యాయం జరిగిందని తెలిపారు. రోస్టర్ పాయింట్-58లో మహిళా అభ్యర్థిని నియమించడం వల్ల తాను రెండో అర్హుడిగా ఉన్నప్పటికీ విస్మరించారని తెలిపారు. జీవో నెంబర్ 77 ప్రకారం క్యారీ ఫార్వర్డ్ పోస్టుల విధానం స్పష్టంగా లేనందున తనకు న్యాయం చేయాలని విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డుపై అక్రమ నిర్మాణాన్ని తొలగించండి

తంబళ్లపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్డుపై చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోసువారిపల్లె దిగువ దళితవాడ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాపూజీ పట్నాయక్‌కు వినతిపత్రం అందచేశారు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె గ్రామం దిగువ దళితవాడలో సిమెంటు రోడ్డుపై ఇదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు గోడ కట్టి రేకులు వేశాడన్నారు. గత మూడు తరాల నుంచి కాలనీ వాసులకు ఈ రోడ్డు అందుబాటులో ఉందని.. ఇప్పుడు రోడ్డుపై అడ్డుగా గోడ కడుతుండటంతో పలు కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. దీనిపై ప్రశ్నించిన గ్రామస్థులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడని, అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో డేవిడ్, గోపాల్, శంకర, నాగరాజు, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన తంబళ్లపల్లె జనసేన నాయకులు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సోమవారం తిరుపతిలోని జనసేన పార్టీ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు స్వగృహంలో తంబళ్లపల్లె జనసేన పార్టీ నాయకులు కొడికండ్ల సోమశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై ఆయనతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం శ్రమించిన కార్యకర్తలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, అలాగే నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు నాదెండ్లను కలిసిన వారిలో చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

తంబళ్లపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె దళితవాడకు చెందిన గంగప్ప(60) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ యువ నాయకుడు, దాత నల్లగుండ్ల మల్లికార్జునరెడ్డి సోమవారం ఉదయం గంగప్ప భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి సూచనల మేరకు గంగప్ప అంత్యక్రియలకు మల్లికార్జునరెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

గుర్రంకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుర్రంకొండలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. తిరుపతి రమాదేవి ఆసుపత్రి వైద్య బృందం దీపిక క్లినిక్ ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది రోగులకు ఆర్థో, జ్వరం, దగ్గు, బీపీ, షుగర్ వ్యాధులకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బి.కొత్తకోట మండల మీట్

బి.కొత్తకోట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్‌షుకూర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో, పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ఎంపీడీవో కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి నవీన్

మదనపల్లె టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ నిర్వహించనున్న ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రతినిధి నవీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు నెలల పాటు నిర్వహించే ఈ శిక్షణకు ఇంటర్ ఉత్తీర్ణులైన, 30 ఏళ్ల వయసు లోపు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9553202509 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిండుకుండలా బాహుదా



బాహుదా ప్రాజెక్టుకు జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తదితరులు

● 'మొంథా'పై అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన ● అత్యవసర ఫోన్‌నంబర్ల ఏర్పాటు

నిమ్మనపల్లి అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో విస్తారంగా వర్షాలు పడడంతో బాహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కూటమి నాయకులు, ఇరిగేషన్ అధికారులతో కలసి చాముండేశ్వరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి బాహుదాకు జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో మండల ప్రజలకు తాగునీటితో పాటు సాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. బాహుదా జలాలను ప్రజలు, రైతులు పొదుపుగా వాడుకుని పంటలు పండించి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ దయానంద‌ప్రసాద్, ఏఈ శ్రీహరిరెడ్డి, ఎంపీడీవో రమేశ్, ఎంఈవో-1 పద్మావతి, టీడీపీ అధికార ప్రతినిధి, ఆర్‌జే వెంకటేశ్, మాజీ సర్పంచ్ రాజన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో కలిగే నష్టాలు, విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి, ప్రజలను రక్షించడానికి అధికారులు అప్రమత్తంగా వుండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్, ఎంపీడీవో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాను నేపథ్యంలో మదనపల్లె మున్సిపాలిటీలో, మూడు మండలాల్లో 24గంటల పాటు అందుబాటులో వుండేలా అత్యవసర నెంబర్లు వుంచామన్నారు. మున్సిపాలిటీలో ఏదైనా అత్యవసర పరిస్థితులు వస్తే 08571-222280 నెంబర్‌కు, ఎమ్మెల్యే కార్యాలయం నెంబర్ 7995699097కు, మదనపల్లె మండలంలో 8688284934, నిమ్మనపల్లె మండలంలో 9491077054, రామసముద్రం మండలంలో 9676857690 నెంబర్‌కు ప్రజలు ఫోన్ చేసి సమాచారం అందించి, తగు సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, టీడీపీ నాయకుడు బంగారు రామకృష్ణాచారి, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు షంషీర్, కార్యదర్శి చిన్న మహేష్, సుద్దిళ్ల సుధాకర్, జంగాల రమణ, శశి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుపై మండల, గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. సోమవారం ఆయన బాహుదా ప్రాజెక్టు నుండి విడుదలైన నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుండి బయటికి రావద్దని, ప్రమాదాలు సంభవిస్తే స్థానిక కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ముష్టూరు, కొండయ్యగారిపల్లి రహదారులలో బాహుదా నీరు ప్రవహిస్తుడంతో ముళ్ల కంచె వేసి మూసివేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, కార్యదర్శులు చిరంజీవి, నాగరాజు, రాజశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తుఫానుపై మహిళా పోలీసులతో సమావేశం

మలకలచెరువు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సీఐ వెంకటేశులు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా జూదాలు, కోడి పందేలు ఆడడంతో పాటు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తక్షణం సమాచారం ఇవ్వాలన్నారు.

కురబలకోటలో పొంగిన కాలువలు

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో మండలంలో మధ్యాహ్నం కురిసిన వర్షానికి కాలువలు పొంగి పొర్లాయి. కురబలకోట సమీపంలో వర్షపునీరు చెరువులోకి పోకపోవడంతో రోడ్డుపై వర్షపునీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడటంతో తహసీల్దార్ ధనంజయ అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో కాలువ తీయించి నీటిని చేరువులోకి మళ్లించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి అధికారులకు విధులను కేటాయించారు.

సీఎం సహాయనిధి పేదలకు భరోసా

● టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి అన్నారు. సోమవారం తంబళ్లపల్లె మండలంలో 8 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.5.73 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి చెక్కులను అందచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుయువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, పురుషోత్తం, కాలానారాయణ, వీరాంజినేయులు, క్లస్టర్ ఇంచార్జి బేరి శీన, జగదీష్, కోటకొండ రెడ్డప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మృతి



శివరామిరెడ్డి(ఫైల్)

మదనపల్లె టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లె బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆవుల శివరామిరెడ్డి సోమవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం లీగల్ అడ్వయిజర్‌గా పనిచేసిన శివరామిరెడ్డి మృతి పట్ల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి సంతాపం వ్యక్తం చేశారు.

కట్ట మీద నెర్రెలు ప్రమాదకరమే

● కలికిరి పెద్దచెరువు కట్టను పరిశీలించిన జలవనరుల శాఖ ఈఈ సురేశ్‌బాబు



కట్టమీద కుంగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జలవనరుల శాఖ ఇంజనీర్లు

కలికిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కలికిరి పెద్దచెరువు కట్ట మీదున్న నెర్రెలు ప్రమాదకరమైనవని జలవనరుల శాఖ ఇంజినీర్లు గుర్తించారు. చెరువు కట్ట మీద నెర్రెలు పడి కట్ట కుంగిపోతున్న అంశం గురించి సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఇంజినీర్లు స్పందించారు. మదనపల్లె ఈఈ సురేశ్‌బాబు, వాల్మీకిపురం డీఈఈ గోపీకృష్ణ, కలికిరి ఏఈఈ శ్రీనివాసులురెడ్డి చెరువు కట్టను పరిశీలించారు. మూసివేసిన తూము ప్రాంతంలోనే కట్ట కుంగిపోవడాన్ని గుర్తించి చెరువు నీటి వైపున్న తూము నుంచి పొలాలకు నీరు వెళ్లడానికి కట్ట అడుగు భాగాన పెద్ద కాలువ వుంటుందని, తూము మాత్రమే మూసివేయడంతో కాలువలో వున్న శూన్యత కారణంగా కట్ట కుంగిందని నిర్ధారించారు. దీన్ని నిర్లక్ష్యంగా వదిలేస్తే చెరువు నిండినప్పుడు వత్తిడి పెరిగి కట్టకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని, ప్రస్తుతం కుంగిన ప్రాంతంలో తవ్వకం చేపడతామన్నారు. అలాగే నర్రావాండ్లపల్లె నుంచి ప్రభుత్వ ఆసుపత్రి భవనాల కింది భాగం నుంచి వెళుతున్న కాలువలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రొక్లైనర్లతో పూడికతీత పనులను చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు బాహుదానది మీద నిర్మించిన కాజ్‌వే తెగిపోవడంతో మహల్ నుంచి కదిరాయచెరువుకు వెళ్లే రహదారిని మూసివేశారు. దీంతో రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. కాజ్‌వేపై వాహనాలు వెళ్ళకుండా ఇరువైపులా కందకాలు తవ్వి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, పంచాయతీ కార్యదర్శి జి.అశోక్, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేశ్‌రెడ్డి, పెద్దచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు రత్నశేఖర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరిప్రశాంత, కలికిరి హెడ్ కానిస్టేబుల్ రఫీ, కానిస్టేబుల్ మధు, వీఆర్వోలు ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, వీఆర్‌ఏలు రెడ్డెప్ప, రామకృష్ణలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బండ్రేవు వీఆర్‌ఏ మృతి

పెద్దమండ్యం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్రేవు వీఆర్‌ఏ లక్ష్మయ్య(62) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బండ్రేవు గ్రామంలో 35ఏళ్లుగా లక్ష్మయ్య వీఆర్‌ఏ(బత్రోతు)గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు. లక్ష్మయ్య కుటుంబసభ్యులను సర్పంచ్ భారతి, తహసీల్దార్ తేజస్వి, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఏలు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.



మృతి చెందిన వీఆర్‌ఏ లక్ష్మయ్య (ఫైల్‌ఫొటో)

అర్హులకు సంక్షేమ ఫలాలు అందించాలి

పీలేరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద రజకులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని సాయిబాబా రజక సహకార సంఘం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివశంకరయ్యను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. తిరుపతి మార్గంలో రూ.5.60 లక్షలతో దోబీఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, అయితే ఆరు నెలలకు పైగా పనులు పూర్తి కాకుండా అసంపూర్తిగా నిలిచిపోయాయని, తక్షణం పెండింగ్ పనులు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు వెంకట్రమణ, కార్యదర్శి కందూరి వెంకట్రమణ, ఉప కార్యదర్శి శిబ్బాల కిరణ్‌కుమార్, కోశాధికారి అంగిశెట్టి సిద్దయ్య, కమిటీ సభ్యులు వెంకట్రమణ, సుబ్రమణ్యం, ఉషారా బీ, ఇందిర, చిట్టెమ్మ, లత, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

వంక కాలువ ఆక్రమణల తొలగింపు

గుర్రంకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పంచాయతీ, పోలీస్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం వంక కాలువ ఆక్రమణలను తొలగించారు. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ పరిధిలో సుంకరవాండ్లపల్లె వద్ద కొండ వంక ఉంది. ఈ వంక గుండా వర్షపునీరు దిగువనున్న చెరువుకు చేరుతుంది. ఈ క్రమంలో వంక నీరు పొలాలపై వెళ్లుతుండడంతో రైతులు మట్టితో అడుకట్ట వేశారు. దీంతో గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమస్యను తీర్చాలని కోరారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, ఎస్‌ఐ రఘురాం తమ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి వంక నీరు వెళ్లేలా ఎక్స్‌కవేటర్‌తో అడ్డుగా వేసిన మట్టిని తొలగించారు. మరోమారు సమస్యను ఉత్పన్నం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలపై దృష్టి పెట్టాలని వినతి

బి.కొత్తకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని బద్దిపల్లిగుట్ట, కురువోనికుంటలో నిర్మితమవుతున్న హౌసింగ్‌కాలనీలలో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తంబళ్లపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్‌కు ఆయా కాలనీల ప్రజలు విన్నవించారు. సోమవారం ఆయన ఈ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షం వస్తే కాలినడకన కూడా వెళ్లడానికి వీలు లేని రోడ్ల దుస్థితిని, వీధులలో సీసీరోడ్లు లేకపోవడం, డ్రైనేజిలు, విద్యుత్ తదితర సమస్యలను వివరించారు. దీనిపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడటంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట జనసేన నాయకులు ప్రసాద్, వెంకీ, నాగేంద్ర, మధు, వీరమహిళ ప్రభావతి వున్నారు.



సమస్యలను వింటున్న సాయినాథ్

సిద్ధేశ్వరుడికి కార్తిక పూజలు



కలకడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కార్తీకమాసం మొదటి సోమవారం రోజున అన్నమయ్య, కడప, చిత్తూరు జిల్లాల భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లతో పాటు గౌరమ్మను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కలికిరి, కలకడ, సంబేపల్లె మండలాల భక్తులు కుటుంబ సమేతంగా గౌరీ నోముల వ్రతంలో పాల్గొన్ని కథ విన్నారు. మహిళలు పెద్ద ఎతున కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ, దాతలు అన్నదానం చేశారు.

పీటీఎం శివాలయంలో...

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, కలశస్థాపన, కలశ పూజలు, గణపతిపూజ, పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, గణపతిహోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి పంచహారతి, సప్తహారతి, నక్షత్రహారతి, మహామంగళహారతి ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా గౌరీ కేదారేశ్వర వ్రత వేడుకలు



నోములు చెల్లించుకుని పూజలలో పాల్గొన్న భక్తులు

వాల్మీకిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలలో విశేష పూజలు జరిగాయి. స్థానిక కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, పట్టణ పడమర పొలిమేరలోని ధర్మపథం సమూహాలయంలో గౌరీ కేదారేశ్వర వ్రత వేడుకలను వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రత నోములు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

బాధ్యతలు చేపట్టిన ఈవోపీఆర్డీ ప్రతాప్‌రెడ్డి



పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండల ఈవోపీఆర్డీగా ప్రతాప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గతంలో పని చేసిన యోగానంద్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇంచార్జ్ ఈవోపీఆర్డీగా మోహన్‌ప్రతాప్ ఉండేవారు. ప్రస్తుతం రెగ్యులర్ ఈవోపీఆర్డీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన కలకడ మండలంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

తంబళ్లపల్లె నూతన ఎంపీపీగా శ్యామల

తంబళ్లపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల నూతన ఎంపీపీగా శ్యామల కోటిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి విదేశాలలో ఉన్న కుటుంబసభ్యుల వద్దకు వెళ్తున్న క్రమంలో ఈనెల 13వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులందరూ కోసువారిపల్లె ఎంపీటీసీ, వైస్ ఎంపీపీగా ఉన్న శ్యామల కోటిరెడ్డిని నూతన ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీవో బాహూజీ పట్నాయక్, ఏవో థామస్ రాజ ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు.



ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్యామల కోటిరెడ్డి